# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 92 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శుక్రవారం 23 మే 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 92 23-05-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## ఏపీలో భారీ వర్షాలు



అమరావతి : తూర్పు అరేబియా సముద్రంలో అల్పపీడనం ఏర్పడింది. అల్పపీడన ప్రాంతం నుంచి తెలంగాణ వరకూ ద్రోణి వ్యాపించింది. దీంతో కోస్తాంధ్రలో అక్కడక్కడా ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. ఎన్టీఆర్ జిల్లా, పల్నాడు, గుంటూరు, కృష్ణ జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు

- తరువాయి 2లో..



## జమ్మూలో ఎన్ కౌంటర్

### ముగ్గురు ఉగ్రవాదులు హతం
### సైనికుడు మృతి

శ్రీనగర్ – ఉగ్రవాదానికి అడ్డాగా మారుతున్న జమ్మూ కాశ్మీర్ లో ఆపరేషన్ ట్రాషి పేరుతో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నారు.. దీనిలో భాగంగా పోలీసులు, బలగాలు సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో నేటి ఉదయం ఇంట్లో నలుగురు ఉగ్రవాదులు నక్కి ఉన్నారనే పక్కా సమాచారంతో ఆ ఇంటిని చుట్టు ముట్టాయి భద్రతా దళాలు. దాదాపు 4 గంటల పాటు ఇరు వర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమైనట్లు అధికారులు తెలిపారు. ఈ ఎన్ కౌంటర్ జమ్మూ కాశ్మీర్‌లోని కిష్ట్వార్ జిల్లాలోని సింగ్‌పోరా (చత్రూ) ప్రాంతంలో జరిగింది. ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం , జమ్మూ కాశ్మీర్ పోలీసులు, సిఆర్పీఎఫ్ సంయుక్తంగా పాల్గొన్నాయి .ఈ ఎన్ కౌంటర్ లో హతమైన ఉగ్రవాదులకు

- తరువాయి 2లో..

## ఆపరేషన్ సిందూర్‌తో

# పాక్‌ను ప్రపంచం ముందు మోకాళ్లపై.. కూర్చోపెట్టాం..



- ఆ ఉగ్రవాదుల్ని మట్టిలో కలిపేశాం
- 22 నిమిషాల్లోనే ఆపరేషన్ సిందూరును ముగించారు
- దేశవ్యాప్తంగా 103 అమృత్ రైల్వే స్టేషన్‌లను ప్రారంభించి జాతికి అంకితమిచ్చిన ప్రధాని
- రాజస్థాన్‌లోని బికనీర్ బహిరంగ సభలో మోడీ ఉద్వేగ ప్రసంగం



రాజస్థాన్ మే 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

బికనీర్ – మన మహిళల సిందూరాన్ని తుడిచిన వాళ్లను మట్టిలో కలిపేశామని ప్రధాని మోడీ అన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులను అంతం చేశామని తెలిపారు. కేంద్రం త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చిందని గుర్తుచేశారు. మన దళాలు చక్ర వ్యూహాలు పన్ని శత్రువులను ఉక్కిరిబిక్కిరి చేశాయని తెలిపారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్ర దాడికి జవాబుగా 22 నిమిషాల్లోనే ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదుల్ని మట్టుబెట్టినట్లు చెప్పారు. భారత్‌లో రక్తపుటేర్లు పారించిన వాళ్లను ముక్కలు.. ముక్కలు చేసినట్లు మోడీ పేర్కొన్నారు.

అమృత్ భారత్ స్టేషన్


- తరువాయి 2లో..



## గిట్టుబాటు ధరపై.. సీఎం చంద్రబాబు సమీక్ష..!

అమరావతి మే 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పంటలకు గిట్టుబాటు ధరలకు సంబంధించి సీఎం నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పంటలు, ధరలపై ఏర్పాటైన మంత్రి వర్గ ఉపసంఘంతో కలిసి నేడు ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వ్యవసాయ శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులు నష్టపోకుండా వ్యవసాయ శాఖ ముందే జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ల పరిస్థితిని విశ్లేషించి ఏ పంటలు సాగు చేయాలో రైతులకు సూచించాలని సీఎం పేర్కొన్నారు. డిమాండ్ ఉన్న పంటలే సాగయ్యేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగా హెచ్డీ బర్లే పొగాకు మెట్రిక్ టన్నుకు రూ.12,000, కోకోకు కేజీకి రూ.500 ధర చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం వెల్లడించారు. కంపెనీల ద్వారా ఈ పంటల కొనుగోళ్లు జరిగేలా చూడాలని చెప్పారు. మద్దతు ధర కన్నా తక్కువగా మార్కెట్‌లో తక్కువ ధరకు అమ్మాల్సి వస్తే రైతులు నష్టపోకుండా వారిని ఆదుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు. హెచ్డీ బర్లే, వైట్ బర్లే రకాలను టొబాకో బోర్డులో చేర్చేందుకు కేంద్రంతో చర్చలు జరుపుతున్నామని సీఎం తెలిపారు. ఈ ఏడాది హెచ్డీ



బర్లే రకానికి “క్రాప్ హాలిడే” ప్రకటించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తద్వారా రైతులు నష్టపోకుండా చూసుకుంటామని పేర్కొన్నారు. అలాగే ఫ్యూర్ జ్యూస్‌లపై జీఎస్టీ తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మిడ్ డే మీల్స్‌లో, తిరుమల తిరుపతి దేవస్థాన ప్రసాదంగా మ్యాంగో జ్యూస్ చేర్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని

- తరువాయి 2లో..



## లిక్కర్ స్కామ్.. చంద్రబాబు సృష్టే..!

- విజయసాయిరెడ్డి... చంద్రబాబుకు లొంగిపోయారు:
- కూటమికి మేలు చేసేందుకే విజయసాయి రాజ్యసభకు రాజీనామా చేశారన్న జగన్
- 53 లక్షల చదరపు అడుగుల భారీ
- నిర్మాణం అవసరమా అని ప్రశ్న
- ప్రస్తుతం 6 లక్షల చ.అ. విస్తీర్ణంలోనే సచివాలయం, అసెంబ్లీ ఉన్నాయని వెల్లడి
- డాది కాలంలోనే చంద్రబాబు రూ.1.37 లక్షల కోట్ల అప్పు చేశారన్న జగన్
- రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం,
- సంక్షేమం కనుమరుగని విమర్శ
- లిక్కర్, ఇసుక, మైనింగ్‌లో భారీగా మాఫియా నడుస్తోందని వ్యాఖ్య
- ఈనాడు, కొన్ని మీడియా సంస్థలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన జగన్
- విద్యుత్ కొనుగోళ్లలోనూ పెద్ద స్కామ్ జరిగిందని ఆరోపణ

తాడేపల్లి మే 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తాడేపల్లి – వైసీపీ హయాంలో లిక్కర్ విషయంలో ఎలాంటి తప్పు జరగలేదని తేల్చేశారు మాజీ ముఖ్యమంత్రి జగన్. ఆయనకు ఆయనే క్లీన్‌చిట్ ఇచ్చుకున్నారు. తప్పంతా చేసింది చంద్రబాబు ప్రభుత్వమేనని ఎదురుదాడి చేశారు.. తాడేపల్లిలోని ఆయన నివాసంలో నేడు మీడియాతో మాట్లాడుతూ, భయపెట్టి, బెదిరించి తప్పుడు సాక్షాలు సృష్టించి అరాచకంగా ప్రభుత్వం వ్యవహారి స్తోందని దుయ్యబట్టారు. ప్రభుత్వం తనను బెదిరిస్తుందని చెబుతూ ఏపీ బేవరేజెస్ మాజీ ఎంపీ వాసుదేవరెడ్డి హైకోర్టులో మూడుసార్లు పిటిషన్ దాఖలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. 2014–19 మధ్యకాలంలో లిక్కర్ స్కామ్‌లో చంద్రబాబు బెయిల్‌పై ఉన్నారంటూ కొత్త విషయాన్ని బయటపెట్టారు.

కసిరెడ్డికి ఏం సంబంధం ..

బేవరేజెస్ కార్యకలాపాలకు రాజ్ కసిరెడ్డికి సంబంధం ఏంటని ప్రశ్నించారు.

అప్పటి ప్రభుత్వం

- తరువాయి 2లో..

## ఛత్తీస్‌గఢ్‌లో మళ్ళీ ఎన్‌కౌంటర్..


బీజాపూర్‌లో ఐదుగురు మావోయిస్టులు హతం

ఛత్తీస్‌గఢ్ లో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు

పీడియా అటవీ ప్రాంతంలో ఇంకా కొనసాగుతున్న కాల్పులు

తప్పించుకున్న మావోయిస్టుల కోసం కొనసాగుతున్న కూంబింగ్

- మిగతా 2 లో..



## వెండితెరపై లైవ్ .. గ్రామీణులతో పవన్ కల్యాణ్ మాటా మంతి

మంగళగిరి/ టెక్కలి మే 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రజా సమస్యల పరిష్కారానికి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ వినూత్న కార్యక్రమం చేపట్టారు. వెండి తెర ప్రత్యక్ష ప్రసారం ద్వారా మంగళగిరిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి ప్రజలతో ఆయన ముఖా ముఖీ నిర్వహించారు. మన ఊరు %-% మాటామంతి కార్యక్రమం ద్వారా శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలంలోని రావివలస గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉండే సినిమా




థియేటర్ లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.. ఉప ముఖ్యమంత్రి మాటలు వినడమే కాకుండా పలువురు తమ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు.. అలాగే వారి సమస్యలను ఆన్ లైన్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తుల సమస్యలు వెంటనే పరిష్కరించేలా చూడాలని ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పవన్ వెల్లడించారు.

అభిమానుల తాకిడి, భద్రత

- తరువాయి 2లో..

## చిత్తూరుకు చేరుకున్న.. కుంకీ ఏనుగులు..

- బెంగళూరు నుంచి లారీల్లో తరలించిన అధికారులు
- పలమనేరు సమీపంలోని ఎలిఫెంట్ క్యాంప్‌కు రెండు
- తిరుపతి జూపార్క్‌కు రెండు కుంకీ ఏనుగుల తరలింపు



చిత్తూరు, మే 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తిరుపతి – బెంగళూరులోని విధానసౌధ వద్ద నిన్న జరిగిన కార్యక్రమంలో ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కు నాలుగు కుంకీ ఏనుగుల అప్పగించారు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే

- తరువాయి 2లో..

## డిప్యూటీ సీఎం పవనన్నకు నా శుభాభినందనలు

### మంత్రి లోకేష్



అమరావతి మే 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

” డిప్యూటీ సీఎం పవనన్నకు నా శుభాభినందనలు ” అని మంత్రి లోకేష్ గురువారం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ” ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రైతు సోదరుల కష్టాలకు చెక్ పెట్టేందుకు కర్ణాటక నుంచి కుంకీ


- తరువాయి 2లో..

## స్వల్పంగా పెరుగుతున్న కోవిడ్ కేసుల్లో అప్రమత్తమైన రేవంత్ రెడ్డి సర్కార్

హైదరాబాద్ మే 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కరోనా వైరస్ మరోసారి ఆసియాలోని పలు దేశాల్లో పంజా విసురుతోంది.సింగపూర్, హాంకాంగ్ వంటి దేశాల్లో పెరుగుతున్న కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. మన దేశంలోనూ కేసుల

- తరువాయి 2లో..



# సంపాదకీయం

## నియంతలను తలదన్నిన నెతన్యాహు

నియంతల ఏలుబడిలో పౌరహక్కులకు తావు ఉండదు. మంచీ, మానవత్వానికి చోటు దొరకదు. నిరంకుశత్వానికే అక్కడ అగ్రతాంబూలం. కానీ, నేటి ఆధునిక యుగంలో ప్రజాస్వామ్యం ముసుగులో నియంతలను తలదన్నే దేశాలున్నాయంటే నమ్మశక్యం కాదు. అలాంటి దేశాల జాబితాలో అగ్రస్థానం ఇజ్రాయెల్ దేనంటే ఆశ్చర్యపోనక్కరలేదు. పేరుకు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వర్ధిల్లుతున్న ఈ దేశంలో అధికార పీఠంపై కూర్చున్నది అక్షరాలా ఓ నియంత. ఆ పెద్దమనిషి పేరు బెంజమిన్ నెతన్యాహు. ఆయన నేతృత్వంలో గాజాపై గత 18 నెలలుగా ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణకాండలో 52 వేల మందికి పైగా అసువులు బాశారు. లక్షలాదిమంది క్షతగాత్రులయ్యారు. అయినా ఆయన యుద్ధకాంక్ష మాత్రం తీరలేదు సరికదా, రానురాను మరింత పెచ్చరిల్లుతోంది. గాజాపై 'పరిపూర్ణ విజయం' సాధించేవరకూ విశ్రమించబోనని ఇటీవల ఆయన చేసిన శపథమే ఇందుకు ఉదాహరణ. 'గాజాను మొత్తం స్వాధీనం చేసుకుంటాం.

అక్కడ నెలకొన్న కరవు పరిస్థితులను నివారించవలసి ఉంది' అంటూ ఆయన తాజాగా చేసిన ప్రకటన గిచ్చి జోలపాడటమనే సామెతను గుర్తు చేయక మానదు. గాజాను ఇంతటి దుర్భర స్థితిలోకి నెట్టిన నెతన్యాహు ఇప్పుడు దానిని బాగు చేస్తామనడాన్ని చూసి ముక్కున వేలేసుకోనివారు ఉండరు. గాజాలో ప్రస్తుత పరిస్థితిని వర్ణించడానికి మాటలు చాలవు. ఎక్కడ చూసినా శిథిల భవనాలు, బక్కచిక్కిన మనుషులు. ఆకలి బాధను తట్టుకోలేక కళ్లముందే బిడ్డలు చనిపోతుంటే ఏడవడానికి కూడా ఓపికలేని మాతృమూర్తులను చూస్తే ఎవరికైనా గుండె చెరువుకాక మానదు. గాజాకు తక్షణ మానవతాసాయం అందకపోతే, రానున్న 48 గంటల్లో 14వేల మంది చిన్నారులు క్షుద్బాధతో చనిపోయే ప్రమాదం ఉందని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసిందంటే, అక్కడి పరిస్థితి ఎంత భీతావహంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

కానీ నెతన్యాహు మనసు మాత్రం కరగడం లేదు. గత కొన్ని నెలలుగా మానవతాసాయంపై ఉక్కుపాదం మోపిన ఆ పెద్దమనిషి, ఐక్యరాజ్య సమితి హెచ్చరికతోనూ దిగిరాకపోగా, పరిమితి సాయానికి మాత్రమే అనుమతినిస్తామనడం కరడుగట్టిన రాక్షసత్వానికి నిదర్శనం. హమాస్ ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా యుద్ధం ప్రారంభించిన నెతన్యాహు ఆ లక్ష్యానికి ఎగనామం పెట్టి, ఆస్పత్రులు, శరణార్థి శిబిరాలపైనా యథేచ్ఛగా బాంబుల వర్షం కురిపిస్తూ అమాయకుల ప్రాణాలు హరిస్తున్నారు. ఇప్పటివరకూ ఇజ్రాయెల్ సైన్యం హతమార్చిన యాభైరెండు వేలమందిలో హమాస్ ఉగ్రవాదులు ఎంతమందో ఆయన చెప్పగలరా? జనవరి నెలలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని తుంగలో తొక్కి మళ్లీ యుద్ధానికి సిద్ధపడిన నెతన్యాహు ప్రధాన లక్ష్యం గాజా ఆక్రమణే. గాజాను స్వాధీనం చేసుకుని, కరవు పరిస్థితులను నివారిస్తామని నెతన్యాహు చెబుతుండగా, అక్కడి ప్రజలను వేరే చోటికి తరలించి, గాజాను అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంటున్నారు.

మొత్తానికి ఇద్దరికీ ఒకటే లక్ష్యం.. గాజాను హస్తగతం చేసుకోవడం. అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టీ పట్టగానే ఆధునిక శాంతిదూత అవతారమెత్తిన ట్రంప్, రష్యా- ఉక్రెయిన్‌బీ హమాస్- ఇజ్రాయెల్ యుద్ధాలపై గుడ్లురిమారు. తక్షణమే యుద్ధవిరమణ జరగకపోతే జాగ్రత్త అంటూ హెచ్చరించారు. కానీ, వాస్తవంలో తాను ఆశించింది జరగకపోగా, ఇజ్రాయెల్‌ను కనీసం చర్చల వేదికపైకి కూడా రప్పించలేకపోతున్నారు. అంతెందుకు, గాజాపై ఇజ్రాయెల్ అమానుష కాండను తాజాగా బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా ముక్తకంఠంతో ఖండించగా అమెరికా వాటితో గొంతు కలపకపోవడం దేనికి సంకేతం? ఇజ్రాయెల్‌తో స్వేచ్ఛా వాణిజ్య చర్చలను సైతం నిలిపివేసి, బ్రిటన్ తన నిబద్ధతను చాటుకోవడం ప్రశంసనీయం.

హమాస్ చెరలో ఉన్న బందీల విడుదలే లక్ష్యంగా 2023 అక్టోబర్ 1న యుద్ధం ప్రారంభించిన నెతన్యాహు ఇప్పుడు తన లక్ష్యాన్ని తానే తుంగలో తొక్కి గాజా ఆక్రమణ దిశగా అడుగులు వేయడానికి స్వప్రయోజనాలతోపాటు రాజకీయ ప్రయోజనాలు కూడా కారణం. యుద్ధాన్ని ఎంతకాలం కొనసాగిస్తే అంతకాలం తాను పదవిలో కొనసాగవచ్చునన్నది ఆయన ఆలోచనగా కనబడుతోంది. ఇప్పటికే నెతన్యాహుపై అనేక అవినీతి ఆరోపణలపై వివిధ కోర్టులలో విచారణ జరుగుతోంది. మరోవైపు నిరంతర యుద్ధం పట్ల ఇజ్రాయెల్ లోనూ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ దేశాలు ఇప్పటికైనా మేలుకోవాలి. బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా దేశాల బాటలో ఇజ్రాయెల్‌పై వత్తిడి తెచ్చేందుకు చేయీచేయీ కలిపి ముందుకు రావాలి. గాజాకు మానవతా సాయం అందించడమే తక్షణ కర్తవ్యంగా నెతన్యాహు మెడలు వంచేందుకు ప్రణాళికాబద్ధంగా ముందడుగు వేయాలి.

# ఛత్తీస్‌గఢ్‌లో మళ్ళీ ఎన్‌కౌంటర్..

**బీజాపూర్‌లో ఐదుగురు మావోయిస్టులు హతం**

**ఛత్తీస్‌గఢ్ లో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు**

**పీడియా అటవీ ప్రాంతంలో ఇంకా కొనసాగుతున్న కాల్పులు**

**తప్పించుకున్న మావోయిస్టుల కోసం కొనసాగుతున్న కూంబింగ్**

ఛత్తీస్‌ఘడ్, మే 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. తాజాగా బీజాపూర్ జిల్లాలోని పీడియా అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మరణించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఇరువర్గాల మధ్య ఇంకా కాల్పులు జరుగుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, నిన్న నారాయణ్‌పూర్ జిల్లా అబూజ్‌మాడ్ అటవీ ప్రాంతంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు హతమైన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు కూడా మృతి చెందాడు. అలాగే, బాపట్ల జిల్లాకు చెందినట్లుగా భావిస్తున్న మరో కీలక నేత సజ్జ నాగేశ్వరరావు కూడా ఈ ఎన్‌కౌంటర్‌లో మరణించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. అయితే, మృతదేహాలను గుర్తించి, పోస్టుమార్టం నిర్వహించిన తర్వాతే ఈ విషయంపై అధికారిక స్పష్టత రానుంది. ఈ ఘటనలో గాయపడిన రమేష్ అనే జవాను ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడంతో, మొత్తం ఇద్దరు జవాన్లు మరణం పొందినట్లయింది.

**కొనసాగుతున్న కూంబింగ్, మృతదేహాల గుర్తింపు**

అబూజ్‌మాడ్ ఘటన స్థలంలో భద్రతా బలగాలు ఇంకా కూంబింగ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. గాయపడి తప్పించుకున్న మావోయిస్టుల కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. దట్టమైన అటవీ ప్రాంతం కావడం, భారీ వర్షం కురుస్తుండటంతో మృతదేహాలను తరలించే ప్రక్రియ ఆలస్యమవుతోందని పోలీసు వర్గాలు తెలిపాయి. కొన్ని మృతదేహాలను మాత్రమే నారాయణ్‌పూర్ ఆసుపత్రికి తరలించారు. మృతుల గుర్తింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత, వారి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

**వ్యూహాత్మక దాడి, కేంద్రం ప్రశంసలు**

కర్రె గుట్టలో సుమారు 24 రోజుల క్రితం జరిగిన ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులు మరణించినప్పటికీ, అగ్రనేతలు తప్పించుకున్నారు. దీంతో, అబూజ్‌మాడ్‌ను సురక్షిత ప్రాంతంగా భావించి, భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు నంబాల కేశవరావు నేతృత్వంలో కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో స్థాయి నేతలు సమావేశమైనట్లు ఇంటెలిజెన్స్ వర్గాలకు సమాచారం అందింది. ఈ పక్కా సమాచారంతోనే భద్రతా బలగాలు మూడు రోజులుగా వ్యూహాత్మకంగా ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి దాడి చేశాయి. మావోయిస్టులకు మూడు నుంచి నాలుగు అంచెల భద్రత ఉన్నప్పటికీ, బలగాలు వారిని ఛేదించి భారీ విజయం సాధించాయని తెలుస్తోంది. ఈ ఆపరేషన్ విజయం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి, హోంమంత్రి భద్రతా బలగాలను అభినందించారు. అబూజ్‌మాడ్ అటవీ ప్రాంతంలో తప్పించుకున్న మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

## పాక్‌ను ప్రపంచం ముందు మోకాళ్లపై కూర్చోపెట్టాం

పథకంలో భాగంగా 18 రాష్ట్రాల్లో అత్యాధునికంగా తీర్చిదిద్దిన 103 అమృత్ భారత్ స్టేషన్లను రాజస్థాన్ నుంచి నేడు వర్చువల్‌గా మోడీ ప్రారంభించారు. కొత్త స్టేషన్లను జాతికి అంకితమిచ్చారు. ఈ సందర్భంగా బికనీర్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, మే 7న చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ద్వారా జైష్-ఎ-మొహమ్మద్, లష్కరే-ఎ-తోయిబా మరియు హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్రవాద గ్రూపులతో అనుబంధంగా ఉన్న దాదాపు 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారని తెలిపారు. ఉగ్రవాదంపై పోరాటానికి భారతదేశం ఐక్యంగా ఉందని చెప్పారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి 140 కోట్ల మంది భారతీయులను కదిలించిందన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదుల గుండెపై దాడి చేశామన్నారు. సైన్యానికి పూర్తి స్వేచ్ఛ నివ్వడంతోనే ఇదంతా జరిగిందని మోడీ వెల్లడించారు . ఆపరేషన్ సిందూర్ ద్వారా మన త్రివిధ దళాలు పాక్ ను మోకాళ్ల మీద నిలబెట్టాయని అన్నారు. ఇక పాకిస్తాన్ కుట్రలు నడవవన్నారు. ఇకపై ఉగ్రవాద దాడి జరిగితే భారత్ సమాధానం ఇలాగే ఉంటుందని, శత్రువుల న్యూక్లియర్ బాంబు దమ్కీలకు భయపడేది లేదని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మన వైపు వచ్చినప్పుడల్లా భారత్ దే గెలుపు అని ఇది పాత భారత్ కాదని ఇది నయా భారత్ అన్నారు. శత్రువులను ఎలా మట్టుబెట్టాలో ఇప్పుడు మన సైన్యమే డిసైడ్ చేస్తుందని అందుకు తమమా ప్రభుత్వ త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చిందని చెప్పారు. పాక్ కుట్రల్ని ప్రపంచమంతా తెలిపేందుకు మన ఎంపీలు బయల్దేరారన్నారు. పాక్ నిజస్వరూపాన్ని ప్రపంచానికి చూపిద్దామన్నారు. ఆపరేషన్ సిందూర్ న్యాయానికి కొత్త రూపం అని ఈ ఆపరేషన్ ఆక్రోశం కాదని సమర్థ భారత రౌద్ర రూపం అన్నారు. భారత్ ను ఎప్పటికి తలదించుకోనివ్వనని సంచలన వ్యాఖ్యలు చేశారు.

**ఆధునిక మౌలిక సదుపాయల కోసం కొనసాగుతున్న మహాయజ్ఞం**

దేశంలో గడిచిన 12 ఏళ్లుగా ఆధునిక మౌలిక సదుపాయలు కల్పించే మహా యజ్ఞం జరుగుతోందని ప్రస్తుతం భారత్ లో ఎటువైపు వెళ్లినా అభివృద్ధి ఫలాలు కనిపిస్తున్నాయని ప్రధాని అన్నారు. మౌలిక సదుపాయల రంగంలో గతంలో ఖర్చు చేసిన దానికంటే ఆరు రేట్లు ఎక్కువ ఖర్చు చేస్తున్నామని చెప్పారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు, అత్యాధునిక సదుపాయాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఇవాళ మోడీ ప్రారంభించిన రైల్వే స్టేషన్లలో తెలంగాణలోని బేగంపేట, కరీంగనర్, వరంగల్, ఏపీలోని సూళ్లూరుపేట స్టేషన్లు కూడా ఉన్నాయన్నారు. అమృత్ భారత్ స్టేషన్లను ఆయా ప్రాంతాల ప్రత్యేకతలతో నిర్మించామని చెప్పారు. బేగంపేట రైల్వే స్టేషన్ ను కాకతీయ రాజుల ఆర్కిటెక్చర్ శైలిలో నిర్మించామని చెప్పారు. కర్ణిమాత ఆశీర్వాదం తీసుకుని ఇక్కడికి వచ్చానని కర్ణిమాత ఆశీర్వాదంతో భారత్ అభివృద్ధి దిశగా దూసుకెళ్తుందన్నారు.

**బుల్లెట్ ట్రైన్ వచ్చేస్తోంది.. .**

కశ్మీర్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకు మౌలిక సదుపాయాలు మెరుగు పరుస్తున్నామన్నారు. ముంబయి లో అటల్ సేతు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు ప్రధాని. తమిళనాడులో పంబన్ బ్రిడ్జ్ ఏర్పాటు చేసుకున్నామన్నారు. బ్రాడ్ గేజ్ మార్గాల్లో మానవరహిత క్రాసింగ్ లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 30 వేల కిలోమీటర్లకు పైగా కొత్త రైలు మార్గాగు వేయించామన్నారు. దేశంలో 70 మార్గాల్లో వందే భారత్ ట్రైన్లు నడుస్తున్నాయని దేశంలో తొలి బుల్లెట్ ట్రైన్ కోసం అడుగులు పడుతున్నాయని చెప్పారు. త్వరలోనే ఆ రైలు పరుగులు తీస్తుందని అన్నారు మోదీ.

**103 అమృత్ రైల్వే స్టేషన్ లను జాతికి అంకితమిచ్చిన ప్రధాని మోడి**

%జైపూర్ %-% రాజస్థాన్ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ్‌నోక్ రైల్వేస్టేషన్ నుంచి 18 రాష్ట్రాల్లో ఆధునీకరించిన 103 అమృత్ రైల్వే స్టేషన్లను నేడు ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతో తెలంగాణలో 3 ఏపీలో 1, యూపీలో 19, గుజరాత్ 18, మహారాష్ట్రలో 15, రాజస్థాన్‌లో 8 రైల్వేస్టేషన్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ పాల్గొన్నారు. అంతకుముందు బికనీర్‌లోని కర్ణిమాత ఆలయాన్ని ఆయన సందర్శించారు. అమ్మవారికి ప్రధాని మోదీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మ వారి తీర్థ ప్రసాదాలను ఆలయ పూజారులు.. ప్రధాని మోదీకి అందజేశారు. అనంతరం బికనీర్ ఎయిర్ బేస్‌ను మోదీ సందర్శించారు. మరోవైపు బికనీర్ సమీపంలో పాలనా గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొన్నారు.

## జమ్మూలో ఎన్ కౌంటర్

లష్కర్-ఎ-తొయిబా, జైష్-ఎ-మొహమ్మద్ సంస్థలతో సంబంధం కలిగి ఉన్నట్లు భావిస్తున్నారు. జమ్మూకాశ్మీర్‌లో కిష్త్వార్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక సైనికుడు మరణించాడు. గురువారం తెల్లవారుజామున ఉగ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సైనికుడు తీవ్రంగా గాయపడ్డారని, చికిత్స పొందుతూ మరణించాడని ఆర్మీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రాంతంలో భీకర కాల్పులు కొనసాగుతున్నాయని పేర్కొంది.

## గిట్టుబాటు ధరపై.. సీఎం చంద్రబాబు సమీక్ష..!

తెలిపారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి త్వరలో ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులతో చర్చించనున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. పంటలకు గిట్టుబాటు ధర, మార్కెట్ భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన ప్రణాళికలతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.

## లిక్కర్ స్కామ్.. చంద్రబాబు సృష్టే..!

సలహాదారుల్లో ఆయన కూడా ఒకరన్నారు. కేవలం రెండేళ్లు మాత్రమే ఆయన పని చేశారన్నారు. కూటమికి మేలు జరిగేలా విజయసాయిరెడ్డి వ్యవహరించారని ఆరోపించారు. విజయవాడ టీడీపీ ఎంపీతో రాజ్ కసిరెడ్డి వ్యాపారాలు ఉన్నాయంటూ కేశినేని నాని మాటలనే ప్రస్తావించారు. వారికి వ్యాపార సంబంధాలు ఉన్నాయని, పలు కంపెనీలకు డైరెక్టర్లుగా ఉన్నారని చెప్పుకొచ్చారు. తామంతా కలిస్తే గూగుల్ టేకేవర్ కు తెలీదా? అంటూ ప్రశ్నల మీద ప్రశ్నలు సంధించారు.

**మిధున్ రెడ్డిని ఇరికించారు..**

ఎంపీ మిధున్‌రెడ్డికి లిక్కర్ వ్యవహారంలో ఏం సంబంధం అని అన్నారు. లోక్‌సభలో ఆయన ఫ్లోర్ లీడర్ అని చెప్పారు. ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డికి ఏం సంబంధముందని ప్రశ్నించారు. దానికి సంబందించిన ఫైలుపై వారు సంతకం పెట్టలేదన్నారు.

**ఆ ముగ్గురు మంచి అధికారులు**

వైసీపీ హయాంలో పని చేసిన ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్పలు, పీఎస్ఆర్ ఆంజనేయలతోపాటు మరికొందరు మచ్చలేని అధికారులంటూ వారందర్నీ తీసుకొచ్చి జైలులో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో లాటరీ పేరుతో లిక్కర్ షాపులు మంత్రులు, ఎమ్మెల్యేలకు అప్పగించారని తూర్పారబట్టారు. గతంలో చంద్రబాబుపై వచ్చిన ఆరోపణలను వాటిని తమపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ హయాంలో ఎప్పుడూ చూడని బ్రాండ్లు లేవా అంటూ ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వస్తే ధరలు ఎక్కడ తగ్గిస్తామని చెప్పారని, ఎక్కడ తగ్గించారని అన్నారు. ఎంఆర్పీ కన్నా ఎక్కువకు అమ్ముతున్నారని, అది స్కామ్ కాదా అని అన్నారు. 99 రూపాయలకు లిక్కర్ ఇచ్చి, దాని క్వాలిటీని తగ్గించారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు.

**మోసాలతోనే కూటమి ప్రభుత్వం**

కూటమి ప్రభుత్వం ఏడాది పాలన అంతా మోసాలతో నడిచిందన్నారు జగన్. అభివృద్ధి, సంక్షేమం ఎక్కడా అమలు చేయలేదని చెప్పారు. రాష్ట్రంలో 3.8శాతం మాత్రమే గ్రోత్ కనిపిస్తోందన్నారు. ఏడాది పాలనతో ప్రజల కొనుగోలు శక్తి, పెట్టుబడులు తగ్గాయని తెలిపారు. తమ పాలనలో చివరి ఏడాది రూ.67వేల కోట్ల అప్పులు చేశామని, చంద్రబాబు ఏడాది పాలనలో రూ.81వేల కోట్ల అప్పులు చేశారని ఆయన ఆరోపించారు. గతంలో అమరావతి పనుల కోసం 2018లో టెండర్లు పిలిచారని, ఆనాడు ఖరారైన టెండర్ల విలువ అక్షరాలా రూ.41,170 కోట్లని వివరించారు మాజీ సీఎం జగన్. చంద్రబాబు పూర్తి చేసిన పనులు మినహా రూ.35 వేల కోట్లతో పనులు చేయాల్సి ఉందన్నారు. ఆ టెండర్లను రద్దు చేసి, మిగిలిన పనుల అంచనాలు అమాంతం పెంచేసి దోపిడీ చేస్తున్నారని అన్నారు.

**చంద్రబాబుకు లొంగిపోయిన విజయసాయి**

తమ పార్టీ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుకి లొంగిపోయారని ఆరోపించారు జగన్. కూటమికి మేలు చేసేందుకు పదవీకాలం ఉండగానే రాజ్యసభకు ఆయన రాజీనామా చేశారన్నారు. వైసీపీకి ఎమ్మెల్యేల బలం లేదని భావించి, రాజ్యసభకు పంపదని తెలిసి రాజీనామా చేశారన్నారు. ప్రలోభాలకు లోనై ఆ సీటును అమ్మేశారని ఆరోపించారు. అలాంటి వ్యక్తి ఇచ్చిన స్టేట్‌మెంట్లకు ఏం విలువ ఉంటుందని అన్నారు.

**జూన్ 4వ తేదీని వెన్నుపోటు దినం.. నిరసన కార్యక్రమాలు**

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేదాకా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ నిరసన గళం వినిపిస్తూనే ఉంటుందని జగన్ స్పష్టం చేశారు ఈ క్రమంలో.. ఎన్నికల ఫలితాలు వెలువడిన తేదీ జూన్ 4వ తేదీని వెన్నుపోటు దినం గా నిర్వహిస్తామని ప్రకటించారాయన. జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినంగా నిర్వహిస్తాం. ఆరోజున ప్రజలతో కలిసి నిరసనలు చేపడతాం. కలెక్టర్లను కలిసి హామీల డిమాండ్ పత్రాలను సమర్పిస్తాం. చంద్రబాబు చేసిన మోసానికి నిరసనగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రజలంతా కలిసి రావాలని పిలుపు ఇచ్చారు.

## వెండితెరపై లైవ్ .. గ్రామీణులతో పవన్ కల్యాణ్ మాటా మంతి

కారణాల వల్ల ప్రజలతో నేరుగా కలవలేకపోతున్నానని అంటూ ఈ క్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజలతో నేరుగా మాట్లాడాలని నిర్ణయించినట్లు తెలిపారు.. ఈ కార్యక్రమం కోసం రావివలస గ్రామానికి చెందిన 290 మందిని హాజరయ్యారు. గురువారం ఉదయం 9 గంటలకు మొదలైన ఈ లైవ్ షో మూడు గంటలకు పైగా సాగింది. ఇది ఇలా ఉంటే వెండి తెరను.. ప్రజల వేదన తీర్చే సాధనంగా మార్చారంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను గ్రామస్తులు ప్రశంసించారు.

## చిత్తూరుకు చేరుకున్న.. కుంకీ ఏనుగులు..

శివకుమార్, అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే ఈ సందర్భంగా గజ పూజ అనంతరం కర్ణాటక అధికారులు జెండా ఊపి కుంకీ ఏనుగులను సాగనంపగా.. డిప్యూటీ సీఎం పవన్ పూలుజల్లి ఆ ఏనుగులను స్వాగతించారు. కుంకీ ఏనుగులు కృష్ణ (15 ఏళ్లు) అభిమన్యు(14), దేవా (39), రంజన్ (26)లను కర్ణాటక అధికారులు ప్రత్యేక లారీలలో ఎపికి పంపారు%ొ% ఆ నాలుగు ఏనుగులు నేడు పలమనేరు సమీపంలోని ఎలిఫెంట్ క్యాంప్‌కు చేరుకున్నాయి.. వాటిలో రెండు ఏనుగులను తిరుపతి జూ పార్క్ కు తరలించారు.. త్వరలోనే మరో రెండు ఏనుగుల రానున్నాయి.. ఈ నేపథ్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా రైతు సోదరుల కష్టాలకు పరిష్కారం చూపేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవ చూపడంపై మంత్రి నారా లోకేశ్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. 'వపనన్నకు శుభాభినందనలు' అంటూ ట్వీట్ చేశారు. ఏనుగుల విధ్వంసంతో నష్టపోతున్న రైతుల కష్టాలు తీర్చేందుకు కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను తెప్పించిన ఉప ముఖ్యమంత్రికి, అడగగానే కుంకీ ఏనుగులను అప్పగించిన కర్ణాటక ప్రభుత్వానికి మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో ట్విట్ చేశారు.. ఇక యువగళం పాదయాత్ర సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా రైతులు ఈ సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని మంత్రి నారా లోకేశ్ గుర్తుచేసుకున్నారు. ఏనుగుల విధ్వంసంతో పంటలు నష్టపోతున్నామని రైతు సోదరులు తమ ఆవేదన వ్యక్తం చేశారని ఆయన అన్నారు. రైతుల కష్టాలకు చెక్ పెట్టేందుకు పవనన్న ప్రత్యేకంగా చొరవచూపి కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి ఒప్పించారని తెలిపారు.

## డిప్యూటీ సీఎం పవనన్నకు నా శుభాభినందనలు : మంత్రి లోకేష్

ఏనుగులను రప్పించిన డిప్యూటీ సీఎం పవనన్నకు నా శుభాభినందనలు. యువగళం పాదయాత్ర సందర్భంగా ఏనుగుల విధ్వంసంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని పలమనేరు ప్రాంత రైతన్నలు నా దృష్టికి తెచ్చారు. అన్నదాతల ఇక్కట్లను తొలగించేందుకు పవనన్న ప్రత్యేకంగా చొరవ చూపి కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి ఒప్పించారు. ఏపీ అవసరాలకు మరిన్ని కుంకీ ఏనుగులు ఇస్తామని హామీ ఇచ్చిన కర్ణాటక ప్రభుత్వానికి కూడా నా కృతజ్ఞతలు" అని లోకేశ్ పేర్కొన్నారు.

## స్వల్పంగా పెరుగుతున్న కోవిడ్ కేసుల్లో అప్రమత్తమైన రేవంత్ రెడ్డి సర్కార్

సంఖ్య మళ్ళీ స్వల్పంగా పెరుగుతున్నట్లు కేంద్రం వెల్లడించింది. మే 12 నుంచి వారం రోజుల్లో 164 కొత్త కేసులు నమోదయ్యాయని చెప్పారు. ముఖ్యంగా కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో కేసులు పెరుగుతున్నాయి. ప్రస్తుతం పెరుగుతున్న కేసులకు JN.1 వేరియంట్, దాని సంబంధిత ఉప-రకాలు కారణమని భావిస్తున్నారు. ఇది ఒమిక్రాన్ BA.2.86 కుటుంబానికి చెందినదని అంటున్నారు.ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. రేవంత్ సర్కార్ కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో గాంధీ ఆస్పత్రిలో 30 పడకలతో కోవిడ్ వార్డ్ వార్డును ఏర్పాటు చేశారు. కోవిడ్ భయంతో అనవసరంగా ఆందోళనకు గురి కావొద్దని గాంధీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్ వెల్లడించారు. కరోనాను ఎదుర్కొనేందుకు గాంధీ ఆసుపత్రిలో అన్ని ఏర్పాట్లు ప్రారంభించినట్లు తెలిపారు. ఓపీ భవనం రెండో అంతస్తులో ప్రత్యేకంగా వార్డు ఏర్పాటు చేశామని చెప్పారు. కాగా, JN.1 వేరియంట్ లక్షణాలు సాధారణంగా తేలికపాటివిగా ఉంటున్నాయి. గొంతు నొప్పి, దగ్గు, జ్వరం, అలసట వంటివి ప్రధాన లక్షణాలు. చాలా కేసుల్లో ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం లేదని డాక్టర్లు చెబుతున్నారు.పర్యవేక్షణ, ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ , ICMR ఫ్రేమ్‌ల ద్వారా నిఘా కొనసాగుతోంది. జనాభాలో రోగనిరోధక శక్తి తగ్గడం కూడా కేసుల పెరుగుదలకు ఒక కారణం కావచ్చని ఆరోగ్య నిపుణులు భావిస్తున్నారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రత్యేకించి వృద్ధులు, గర్భిణీలు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. రద్దీ ప్రదేశాల్లో మాస్కులు ధరించడం, తరచుగా చేతులు కడుక్కోవడం, అవసరమైతే కోవిడ్-19 టీకా తీసుకోవడం వంటివి పాటించాలని అంటున్నారు. అయితే, ప్రస్తుతం పరిస్థితి నియంత్రణలో ఉందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భారత ఆరోగ్య శాఖ వెల్లడించింది.

## ఏపీలో భారీ వర్షాలు

కురిసే అవకాశం ఉంది. ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు, కృష్ణ జిల్లాల్లో ఉరుములతో కూడిన జల్లులు కురిసే ఛాన్స్ ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. తీరంలో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయి. ఇప్పటి వరకు అమరావతిలో 9, పొదిలి లో ఏడు, మాచర్లలో 6, విశాఖ, మచిలీపట్నం జంగమహేశ్వరంలో 5 సెంటీమీటర్లు చొప్పున వర్షపాతం నమోదైంది. ఈ నేపథ్యంలో భారీ వర్షాల వేళ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. వర్షాలు పడుతున్న సమయంలో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. అత్యవసరం అయితేనే బయటకు రావాలని సూచిస్తున్నారు.







# శిల్పారామంలో ప్రపంచ సుందరీమణుల సందడి

## బతుకమ్మ ఆటపాటలతో సందడి







హైదరాబాద్ నగరంలోని మాదాపూర్ వద్ద గల శిల్పారామం లోని ఇందిరా మహిళా శక్తి బజార్ లో గురువారం ఉదయం ప్రపంచ సుందరీమణులు సందడి చేశారు. బజార్‌లో అడుగుపెట్టిన మిస్ వరల్డ్ పోటీదారుల ముఖాల్లో ఆశ్చర్యం, ఆనందం కనిపించింది. ఒక్కో స్టాల్ చుట్టూ తిరుగుతూ సందడి చేశారు. ఒక్కో మహిళ కథ, మహిళ మణుల కలలు, కష్టాలు, విజయాలు ఇలా ఎన్నో ఇమిడి ఉన్న ఉత్పత్తులను ఆసక్తికరంగా తిలకించారు.

**ఇది కేవలం బజార్ కాదు..**

ఈ సందర్భంగా, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క పోటీదారులను ఉద్దేశించి ప్రసంగించారు. "ఇది కేవలం బజార్ కాదు..ఇది శక్తి కేంద్రం, మార్పునకు చిహ్నం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసే దిశగా పనిచేస్తోంది. మహిళలకు ఆర్థిక స్వేచ్ఛే నిజమైన స్వాతంత్ర్యం. ఇందిరా మహిళా శక్తి బజార్ ఆ స్వాతంత్ర్యాన్ని బలపరుస్తోంది" అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. పురాతన నాగరికతల కాలంలో మాతృస్వామ్య వ్యవస్థ ఉండేదని గుర్తు చేసిన ఆమె, కాల క్రమంలో మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కోల్పోయినప్పటికీ, ఇప్పుడు తిరిగి అన్ని రంగాల్లో రాణిస్తుండటం ఎంతో గర్వకారణం అన్నారు. "మిస్ వరల్డ్ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వడం సాంస్కృతిక మార్పుకు సంకేతంగా నిలుస్తోంది. అందం అంటే కేవలం రూపం కాదు..అది శక్తి, మేధస్సు, స్థితప్రజ్ఞతల సమ్మేళనంష అని సీతక్క అన్నారు.

**సక్సెస్ స్టోరీలు తెలుసుకున్నారు%**

%బజార్ మొత్తం చూసిన మిస్ వరల్డ్ పోటీదారులు ప్రతి మహిళతో మాట్లాడారు. వారు చూసిన ప్రతి స్టాల్ వెనుక ఓ సక్సెస్ స్టోరీ గురించి ఆసక్తికరంగా తెలుసుకున్నారు. 46 లక్షల మంది మహిళలు వడ్డీ లేని రుణాలతో వ్యాపారాలు చేస్తూ సంపద సృష్టిస్తున్నారు. వారు తీసుకున్న లోన్లు 100% తిరిగి చెల్లిస్తున్నారనీ మంత్రి సీతక్క పేర్కొన్నారు. వారంతా బజార్‌ను సందర్శించిన తర్వాత ఇది నిజమైన శక్తి కేంద్రం అని కొనియాడారు.

**సామాజిక మార్పు కోసం**

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సామాజిక మార్పు కోసం ఇందిరా మహిళా శక్తి బజార్ పనిచేస్తుందని తెలిపారు. తెలంగాణ మహిళలు చరిత్రను తిరగరాస్తున్నారని వెల్లడించారు. తెలంగాణ మహిళల శక్తి మీలో నింపుకొని సాధికారత , సామాజిక మార్పు సందేశాన్ని ప్రపంచ దేశాల్లో ప్రచారం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అంతకుముందు సెర్ప్ ఉద్దేశాలను లక్ష్యాలను సీఈవో దివ్య దేవరాజన్ వివరించారు. మహిళా సంఘాలు సాధించిన ప్రగతిని విజయాల డాక్యుమెంటరీనీ ప్రదర్శించారు. మహిళా సంఘాల చే రూపొందించిన వస్తువులను మిస్ వరల్డ్ పోటీదారులకు బహుకరించారు.

**బతుకమ్మ ఆటలో పాల్గొన్న విదేశీ అందాల భామలు**

తెలంగాణ సంస్కృతిలో ప్రధానంగా గుర్తించబడే బతుకమ్మ పండుగను మిస్ వరల్డ్ పోటీదారులు ప్రత్యక్షంగా అనుభవించారు. "చందమామా ఒకే పువ్వేసి%ౌ%" అంటూ సాంప్రదాయ గీతాల నడుమ పువ్వులతో ముస్తాబైన బతుకమ్మ చుట్టూ పాడుతూ, నాట్యమాడుతూ అలరించారు. విదేశీ అందాల భామలు సైతం చేతిలో పువ్వులు పట్టుకుని, స్థానిక మహిళలతో కలిసి నృత్యం చేయడం విశేషంగా ఆకట్టుకుంది. వారి ఉత్సాహం, ఆసక్తి స్థానికులను ఆశ్చర్యంలో ముంచెత్తింది. కొందరు పోటీదారులు బతుకమ్మ నృత్యంలో ప్రత్యేక శైలి చూపించగా, తెలంగాణ మహిళలతో కలసి పాడిన పాటలు వారి కలచొప్పిన అభిమానాన్ని చూపించాయి.

**విక్టోరియా మెమోరియల్ హోమ్ సందర్శనకు సిద్ధం**

శిల్పారామం పర్యటన అనంతరం మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ హైదరాబాద్ నగరంలోని మరో చారిత్రక స్థలం అయిన విక్టోరియా మెమోరియల్ హోమ్‌ను సందర్శించనున్నారు. ఈ పర్యటనలో కూడా వారికి సాంస్కృతిక ప్రదర్శనలు, చారిత్రక సమాచారం అందించనున్నారు.

ఈ పర్యటన ముగిసిన అనంతరం మిస్ వరల్డ్ పోటీదారులు హైదరాబాద్‌లోని ఐకానిక్ విక్టోరియా మెమోరియల్ హోమ్‌ను సందర్శించనున్నారు. మిస్? వరల్డ్? పోటీదారుల పర్యటన నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఇక, 72వ మిస్ వరల్డ్ పోటీలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, మిస్ వరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కలిసి నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ పోటీలు తాజాగా కీలక దశకు చేరుకున్నాయి. ఇప్పటికే టాప్ 25 లిస్ట్‌ను సంస్థ విడుదల చేసింది. భారత్ తరపున రాజస్థాన్‌కు చెందిన 21 ఏళ్ల నందిని గుప్తా పోటీలో ఉన్నారు. ఈ పోటీలు మే 10 వ తేదీన ప్రారంభమవ్వగా మే 31 వరకు జరగనున్నాయి. ఆ రోజే విన్నర్‌ని కూడా ప్రకటిస్తారు.






















# 21 రోజుల్లోపే కొత్త కార్డులు : నాదెండ్ల మనోహర్

**అమరావతి మే 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అమరావతి : రాష్ట్ర వ్యాప్తంగా మే 7 నుంచి బియ్యపు కార్డుల్లో మార్పులు, చేర్పులు చేపట్టామని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కేంద్రం ఆదేశించినట్టు కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి కార్డును ఈ %-% కెవైసి చేశామని.. దేశంలో 95 శాతం ఈకైవైసీ పూర్తి చేసుకున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని ఆయన వెల్లడించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 4,24,59,028 మందికి ఈకైవైసీ పూర్తి అయ్యిందని.. 22,59,498 మంది కి మాత్రమే ఈకేవైసీ పూర్తికాలేదని తెలిపారు. సర్వర్ ఆపేసిన తర్వాత అనేక మంది అప్లికేషన్లు ఇస్తున్నారని.. ఇప్పటి వరకు ఐదు లక్షల అరవై వేల మంది కొత్త బియ్యపు కార్డులు కావాలని దరఖాస్తు చేశారని.. కుటుంబ విభజన (%హాజూశ్రీఱఅఅస్త్ర%) కోసం 44వేల మంది దరఖాస్తు చేశారని చెప్పారు. ఛేంజ్ ఆఫ్ అడ్రెస్ కోసం 12,500 మంది దరఖాస్తులు పెట్టనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయానికి రైస్ కార్డుల డేటాను అనుసంధానం చేశామని వెల్లడించారు. సాంకేతికపరమైన లోపాల వల్ల ఇబ్బంది కలిగినందుకు ప్రజలను ఆయన క్షమాపణ కోరారు. ప్రజలకు వెసులుబాటు కల్పించేలా చర్యలు తీసుకోవాలని వీడియో కాన్ఫరెన్స్ పెట్టి మరీ అధికారులను ఆదేశించినట్లు వివరించారు. ఇది నిరంతరంగా జరిగే ప్రక్రియ.. ప్రజలు తొందరపడకండన్నారు. కార్డుదారుల సమాచారం డేటా బేస్ లో పెట్టి.. ప్రజలకు స్మార్ట్ రైస్ కార్డులు అందిస్తామని చెప్పారు. రేషన్ తీసుకున్నప్పుడే మీకు అప్ గ్రేడ్ అయిపోతుందని.. ప్రజలు ఎక్కడకీ వెళ్లకూడదని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మ్యారెజ్ సర్టిఫికేట్ అవసరం లేదని.. పెళ్లి సంబంధించి ఫొటో కూడా అక్కర్లేదని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది.. వాటితో సంబంధం లేకుండా దరఖాస్తులు తీసుకోవాలని ఆదేశించారు. కొన్ని ప్రాంతాలలో ఈ కారణాలతో దరఖాస్తులు వెనక్కి ఇస్తున్నట్లు తెలిసింది. ఇక అలా చేయకండని చెప్పారు. కార్డులో కొత్తగా పేర్లు ఎక్కించాలన్నా కూడా పరిశీలించి వెంటనే ఎక్కించండని.. ఒక పేరు తొలగించాలంటే.. తప్పకుండా డాక్యుమెంట్ ప్రూఫ్ ఉండాలన్నారు. డిలీషన్ అనేది.. డెత్ కేసులకు మాత్రమే ప్రస్తుతం పరిమితం చేస్తున్నామని.. ఇతర రాష్ట్రాలలో, ఇతర దేశాలలో ఉంటే.. వారికి కూడా డిలీషన్ ఆప్షన్ ఇస్తున్నామని చెప్పారు. మహిళలు, స్త్రీలుతో పాటు, ట్రాన్స్ జండర్స్ కు కూడా అవకాశం కల్పించామని.. కుటుంబ సభ్యుల్లో హెడ్ ఆఫ్ ది ఫ్యామిలీ మార్పులు కూడా చేస్తున్నామన్నారు.



"క్షేత్రస్థాయిలో మాకు వస్తున్న ఫీడ్ బ్యాక్ ను బట్టి ఎప్పటికప్పుడు ప్రజలకు ఇబ్బంది లేకుండా మార్పులు చేస్తున్నాం. రైస్ కార్డు సరెండర్ చేయాలనుకుంటే.. కుటుంబం మొత్తం కలిపి చేయవచ్చు. కొంతమంది ఆకార్డులో వ్యక్తులను మాత్రమే తొలగించాలని చూస్తున్నారు.. అది ఇప్పుడే సాధ్యం కాదు. వారంరోజుల్లో దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటాం. సర్వర్ సమస్యలతో చాలాసార్లు ఇబ్బందులు పడుతున్నారు. త్వరలోనే దీనిని సరి చేసి.. మెరుగైన సేవలు అందిస్తున్నాం. ఈకెవైసీ, ఆధార్ సీడింగ్ లో మార్పులు, రైస్ కార్డు సరెండర్ చేసుకునే అవకాశాలు వాట్సప్ ద్వారా చేసుకునేలా ఎనెబుల్ చేశాం. కొత్త రైస్ కార్డులు జారీలో ఎక్కడా ఎటువంటి జాప్యం లేదు.. దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లోపే కొత్త కార్డులు అందరికీ ఇస్తున్నాం." అని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు.




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

# కోలాహలంగా హనుమాన్ జయంతి వేడుకలు



**ఆలమూరు, మే 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

వైశాఖ మాసం కృష్ణపక్షంలో దశమి తిధినాడు శివాంశ సంభూతునిగా, కేసరిసుతునిగా అంజనాదేవి గర్భాన ఆంజనేయుడు ఉదయించాడని పరాశర సంహిత తెలుపుతుంది. ఈ సందర్భంగా శ్రీరామభక్తుడైన హనుమంతుని జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా ఆలమూరు మండల వ్యాప్తంగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆలమూరు, చింతలూరు, పెద్దపళ్ళ, సంధిపూడి, మడికి, మోదుకూరు,జొన్నాడ తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రాతః కాలం నుంచే అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రామభక్తుని ఆశీస్సులు అందుకున్నారు.

# ఆత్రేయపురం పూతరేకుల తయారీలో కల్తీ నెయ్యి కలకలం

**- 80 కేజీల కల్తీ నెయ్యి స్వాధీనం చేసుకున్న అధికారులు**



**ఆత్రేయపురం, మే 22, (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన ఆత్రేయపురం పూతరేకుల తయారీలో కొంతమంది స్వార్థపరులు కల్తీ నెయ్యి వాడుతున్నట్టు మరోసారి బయటపడింది. ఇటీవల కాలంలో పలు దుకాణాల్లో పూతరేకుల తయారీలో కల్తీ నెయ్యి వినియోగిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తడంతో అధికారులు దాడులు చేసి కొన్ని షాపుల్లో కల్తీ నెయ్యి స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. తాజాగా స్థానిక లక్ష్మీ డ్రైఫ్రూట్స్ షాపులో కల్తీ నెయ్యి ఉందని స్థానికులే రెవెన్యూ, ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో గురువారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 80 కేజీల కల్తీ నెయ్యి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసారు. అలాగే స్థానికంగా ఉన్న పలు దుకాణాల్లో కూడా అధికారులు తనిఖీలు నిర్వహించారు. కల్తీ నెయ్యి వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పూతరేకులు తయారీలో కల్తీ నెయ్యి వినియోగించకుండా అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# లారీ యూనియన్ అధ్యక్షునిగా నల్లా శ్రీరాములు. ( రాంబాబు )..



**అమలాపురం, మే 22, (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**

అమలాపురం లారీ యూనియన్ సమావేశం గురువారం ఉదయం దగ్గర గల లారీ స్టాండ్ లో జరిగినది ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు లారీ యూనియన్ అధ్యక్షులుగా నల్ల శ్రీరాములు (రాంబాబు) ఎన్నిక కాగా గౌరవ అధ్యక్షునిగా కురచ నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కోరసిక శ్రీనివాసరావు, కార్యదర్శిగా పోలిశెట్టి రాంబాబు,జాయింట్ సెక్రటరీలుగా నల్లా భాస్కరరావు,అల్లూరి బాల సురేంద్ర వర్మ, ట్రెజరర్ గా షేక్ నజరుద్దీన్, ముఖ్య సలహాదారునీగా అడపా జనార్దన్ రావులను సమావేశం ఎన్నుకుంది.ఈ పదవులలో వీరు సంవత్సరం పాటు కొనసాగుతారు. ఎలా ఉండగా సమావేశంలో ఈ పదవులన్నీ సామాజిక వర్గానికి ఇచ్చుకున్నారని, శెట్టిబలిజలకు మొండి చెయ్య చూపారని గత 45 ఏళ్లుగా అధ్యక్ష కార్యదర్శులు పదవులు కాపు సామాజిక వర్గానికే కేటాయిస్తున్నారని.. ఈసారి కనీసం కార్యదర్శి పదవి అయిన దక్కించుకోవాలని శెట్టిబలిజ వర్గీయులు సర్వసభ్య సమావేశంలో చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. లారీ యూనియన్ కార్యవర్గ ఎంపిక విషయంలో శెట్టిబలిజ సామాజిక వర్గానికి జరిగిన అన్యాయం పై నగరంలోని రాజకీయ పార్టీల నాయకులు పలువురు చర్చించుకున్నారు. శెట్టిబలిజ సామాజిక వర్గా నికి పదవులు బక్కకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తూ లారీ యూనియన్ సమావేశం నుంచి శెట్టిబలిజ సామాజిక వర్గం బహిష్కరించింది.

# పోలవరం జిల్లా ఎన్నికల హామీ నెరవేర్చాలి

**-యాదవ సంఘం డైరెక్టర్ నాగబాబు**

**పోలవరం, మే 22(తెలుగు రాష్ట్రం విలేకరి):**



ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక పోలవరం జిల్లా ఎన్నికల హామీని నెరవేర్చాలని ఏలూరు జిల్లా యాదవ సంఘం డైరెక్టరు కోరశిక నాగబాబు కోరారు. గురువారం ఈ మేరకు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న నేపథ్యంలో ప్రత్యేక పోలవరం జిల్లా జిల్లా కేంద్రం హామీలు నెరవేరుతాయనే ఆశాభావంతో ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు.

# ఘనంగా అమలాపురం పార్లమెంటు స్థాయి మినీ మహానాడు





**అమలాపురం, మే 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అమలాపురం పార్లమెంటు స్థాయి మినీ మహానాడు గురువారం మధ్యాహ్నం స్థానిక డాక్టర్ మెట్ల సత్యనారాయణ రావు కాపు కళ్యాణ మండపం నందు జిల్లా టిడిపి అధ్యక్షురాలు రెడ్డి అనంత కుమారి సుబ్రహ్మణ్యం గారి అధ్యక్షతన జరిగినది.రాష్ట్ర మంత్రివర్యులు మరియు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీ కింజరాపు అచ్చేనాయుడు గారు ముఖ్యఅతిథిగా పాల్గొని మహానాడులో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు గారు, ప్రభుత్వ విప్ దాట్ల బూచ్చిరాజు, మండపేట శాసనసభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు, కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు,పి గన్నవరం కన్వీనర్ నామన రాంబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ లు దెందుకూరి సత్యనారాయణ రాజు, కడలి వెంకటేశ్వరరావు,చిలువురి సతీష్ రాజు, మోకా ఆనందం సాగర్, దంగేటి వెంకటేశ్వరావు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చేట్టి చంద్రమౌళి, రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహ కార్యదర్శి మెట్ల రమణబాబు, మండల అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ సుభాష్ చంద్రబోస్,మల్లుల పోలయ్య, అరిగేలా నానాజీ, రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కర్రి రామస్వామి, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు పొలమూరి ధర్మపాల్, నేదునూరి వీర్రాజు, చెల్లి వివేకానంద,మేకిరెడ్డి పూర్ణిమ,నల్ల స్వామి,పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు పెచ్చేటి విజయలక్ష్మి, పార్లమెంట్ రైతు అధ్యక్షులు మట్ట మహాలక్ష్మి ప్రభాకరరావు, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి అధికారి జయవేంకట లక్ష్మి,గుత్తుల సాయి, మద్దల సుబ్బారావు, నాగిడి నాగేశ్వరావు, మోకా పార్వతి, కుసుమ సూర్యమోహన్ రావు, డొక్కా నాదబాబు, పోదోకు బాలు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు











# అందరి ఆకలి తీర్చే అక్షయ పాత్రగా అన్న క్యాంటీన్లు


**- అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇన్చార్జి మంత్రి అచ్చెన్నాయుడు- అమలాపురంలో అన్న క్యాంటీన్ ప్రారంభం**






**అమలాపురం, మే 22, (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**

పేద, ధనిక తేడా లేకుండా అందరి ఆకలి తీర్చే అక్షయ పాత్రగా అన్న క్యాంటీన్లు పని చేస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ, సహకార, పశు సంవర్ధక, మార్కెటింగ్, మత్స్యశాఖల మంత్రి, అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇన్చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అమలాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన 202వ అన్నా క్యాంటీన్ ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదానాన్ని మహా భాగ్యంగా భావించాలన్నారు. కేవలం రూ.5కే ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనాలు ఏర్పాటు చేయడం ఆషామాషీ విషయం కాదని, నాణ్యమైన భోజనం పరిశుభ్రమైన వాతావరణంలో పెట్టే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి 15 రోజులకు ఒకసారి ఆర్టిజిఎస్, ఐవిఆర్ఎస్ లద్వారా లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరిస్తున్నారని చెప్పారు. 98 శాతం అన్న క్యాంటీన్ల పనితీరు బాగుందని ప్రజాభిప్రాయం వెల్లడైందన్నారు. ఇప్పటి వరకు పట్టణ ప్రాంతాలకే పరిమితమైన అన్న క్యాంటీన్లు ప్రతి నియోజకవర్గంలో ఉండాలని సంకల్పించి మరో 70 అన్నా క్యాంటీన్లకు టెండర్లు పిలవడం జరిగిందని తెలిపారు. ఇకపై 175 నియోజకవర్గాల్లో అన్న క్యాంటీన్లు నడుస్తాయన్నారు. వీటి నిర్వహణకై కమిటీని ఏర్పాటు చేసి సొసైటీని నియమించామన్నారు. స్థానికంగా పురప్రజలు తమ పుట్టినరోజుల సందర్భంగా అన్న క్యాంటీన్లో ఆరోజు భోజన ఖర్చును విరాళంగా అందించవచ్చునని సూచించారు. అదేవిధంగా దాతలు ముందుకు వచ్చి ఒక నెల ఖర్చును కూడా అందించి దాతృత్వాన్ని చాటుకోవాలన్నారు. జిల్లా కేంద్రం అమలాపురంలో పండుగ వాతావరణంలో క్యాంటీన్ ను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన అన్న క్యాంటీన్లు నిరుపేదల ఆకలి తీర్చడంలో కీలకంగా మారాయన్నారు. అన్న క్యాంటీన్లు 2014లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించిన సబ్సిడీ ఆహార సేవా కార్యక్రమమన్నారు. కిలో రూ. 2 కే సబ్సిడీ బియ్యాన్ని ప్రవేశపెట్టిన “అన్న”గా ప్రసిద్ధి చెందిన స్వర్గీయ ఎన్.టి రామారావు గౌరవార్థం ఈ కార్యక్రమానికి అన్న క్యాంటీన్ గా నామ కరణం చేశారన్నారు. వివిధ రంగాల్లో జీవనోపాధి పొందుతున్న చివరి స్థాయి కార్మికులు అన్న క్యాంటీన్లను ఆశ్రయించి ఆకలి తీర్చు కుంటున్నారనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదని తెలిపారు. చిరు వ్యాపారస్తుల పాలిట ఈ క్యాంటీన్లు ఒక వరంగా మారి ఆకలిని తీర్చడంలో కీలక భూమిక పోషిస్తున్నాయన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు, పొట్టకూటి కోసం పల్లెలనుంచి, పట్టణాలకు వచ్చే రోజు వారీ కూలీలు, ఉదయం నుంచి రాత్రి వరకు కష్టపడే ఆటో డ్రైవర్లు, ప్రైవేటు ఉద్యోగులు, ఇతరులకు అన్న క్యాంటీన్లే ఆకలి తీరుస్తున్నాయన్నారు. రోడ్డు పక్క టీ తాగాలన్నా కనీసం రూ.10ఖర్చు చేయాల్సిన ప్రస్తుత కాలంలో అల్పాహారమైనా, భోజనమైనా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కే అందిస్తుందని, ఇంత తక్కువకు ఎక్కడా లభించదన్నారు. నిరాశ్రయులు, పూటగడవని నిరుపేదలు మాత్రమే కాదు మధ్య తరగతి వారు అన్న క్యాంటీన్లకు వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. గ్రామాల నుంచి వైద్య పరీక్షలు, చికిత్సల నిమిత్తం అసుపత్రులకు వచ్చే వారు వాటినే ఆశ్రయిస్తున్నారన్నారు. హెూటళ్ల కు వెళ్లే ఆర్థిక స్తోమత లేని వారు అన్నా క్యాంటీన్లో రూ.5, చాలక పోతే మరో రూ.5 ఇచ్చి మరో టోకెన్ తీసుకొని సంతృప్తిగా ఆకలిని తీర్చుకుంటున్నారన్నారు. వీటి పుణ్యమా అని రోజువారీ కూలీలే కాదు, సుదూర ప్రాంతాల నుంచి వచ్చి చదువుకొనే విద్యార్థులకు రూ.15 కే మూడు పూట లాకడుపు నింపుతోఔదన్నారు. నిరుపేదల కడుపు నింపే అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించడంతో పేదల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందన్నారు. స్వచ్ఛమైన తాగునీరు, చేతులు శుభ్రం చేసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు, ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్నా క్యాంటీన్ల నిర్వహణకు చర్యలు తీసుకున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన అన్న క్యాంటీన్లలో మెనూ ఖచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, అమలాపురం, కొత్తపేట ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఆర్డీఓ కె.మాధవి, మున్సిపల్ ఛైర్మన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, మెట్ల



# హనుమాన్ జయంతి సందర్భంగా మహా అన్న సమారాధన




**టి.నరసాపురం, మే 22 (తెలుగు రాష్ట్రం విలేకరి):**

టీ.నర్సాపురం మండలం వెంకటాపురం గ్రామంలో గత 15 సంవత్సరాలుగా నుంచి పాలకుర్తి రామకృష్ణ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలో వేదమంత్రాలతో బాజా భజంత్రీలతో ప్రత్యేక పూజలు హెూమాలు నిర్వహించారు. హరే శ్రీనివాస ధర్మాజీగూడెం కామవరపుకోట బృందం వారిచే కోలాటం అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో చుట్టుపక్కల గ్రామస్తులు వచ్చి అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యెల్లిన హరిబాబు, పాలకుర్తి సూర్యనారాయణ, అంజిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు

# రోడ్లు రాకపోకలు ఆపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**టీ. నర్సాపురం, మే 22 (తెలుగు రాష్ట్రం విలేకరి):**



టి. నర్సాపురం మండలం జగ్గవరం పంచాయతీలో బర్రె వారిగూడెం గ్రామంలో రోడ్డుకు అడ్డంగా తాడిచెట్టు, ముళ్ళ కంప అడ్డువేసి రాకపోకలను నిలుపుదల చేశారు. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం ఆ గ్రామానికి చెందిన నాలుగైదు కుటుంబాలు వారు ఈ స్థలం మాది అని అడ్డు వేసినట్లు తెలిపారు. ఈ గూడెంలో సుమారు 30 కుటుంబాలు వారిని గత నాలుగు రోజులుగా ఆ రోడ్డు మార్గాన్ని నడవనివ్వకుండా వాహనములు వెళ్ళనీయకుండా ఇబ్బంది కలుగజేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ రోడ్డు మార్గంలో గత 40 సంవత్సరాల నుంచి రాకపోకలు జరుగుతున్నాయని రోడ్డుకి అడ్డుగా వేసిన వాటిని తొలగించి రాకపోకలు కొనసాగించి రోడ్డు రాకపోకలు నిలుపుదల చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డుకి అడ్డంగా వేసిన చెట్లను తొలగించాలని స్థానికులు ధర్నా చేస్తున్నారు.

## సింగిల్ విండో పథకం ద్వారా పరిశ్రమల మంజూరుకు ప్రతి అంశాన్ని క్షుణంగా పరిశీలించాలి.

**-జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ కె. వెట్రిసెల్వి..**





ఏలూరు, మార్చి 22(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

జిల్లాలో సింగిల్ విండో కింద పరిశ్రమల స్థాపనకు, ఇతర ప్రోత్సాహకాలు మంజూరు విషయంలో ప్రతి అంశాన్ని క్షుణంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సూచించారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో గురువారం జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదని, ప్రభుత్వ ప్రాధాన్యతను ననుసరించి పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ధరఖాస్తులను పరిశీలించి నిబంధనల మేరకు ఉన్న దరఖాస్తులకు సింగిల్ విండో పథకం ద్వారా నిర్దేశించిన సమయంలోగా అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. సింగిల్ విండో కింద అందిన 84 దరఖాస్తుల్లో ఇప్పటికే 51ధరఖాస్తులు ఆమోదం పొందగా మిగిలిన 33 ధరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశ్రమల అభివృద్ధి పాలసీని అనుసరించి 11 పరిశ్రమలకు రూ. 31.42 లక్షలు ప్రోత్సాహకాలుగా మంజూరుకు సమావేశం ఆమోదం తెలిపింది. భీమడోలు మండలం అంబర్ పేట గ్రామంలోని లిక్సిల్ సిరమిక్ పరిశ్రమ నుంచి జాతీయ రహదారికి సిసి రోడ్డు నిర్మాణానికి సంబంధించి పరిశీలన చేసి నివేదిక అందజేయాలని పంచాయితీరాజ్ ఎస్ఇ ని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంతోపాటు ఫుడ్ ప్రోసెసింగ్ సమావేశాన్ని కలిపి నిర్వహించాలని జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారిని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎల్డిఎమ్ డి. నీలాద్రి, ఎస్సీ కార్పోరేషన్ ఈడి ఎం. ముక్కంటి, జిల్లా అగ్నిమాపక అధికారి సిహెచ్. రత్నబాబు, నగరపాలక సంస్థ కమీషనరు ఎ. భానుప్రతాప్, డిప్యూటీ ఇన్ఫెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్. త్రినాధరావు, వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గున్నారు.

## ఏలూరులో ఘనంగా హనుమాన్ జయంతి శోభాయాత్ర బైక్ ర్యాలీ

**-శోభాయాత్రను ప్రారంభించిన బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, సత్యానందగిరి స్వామీ**





ఏలూరు, మార్చి 22(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏలూరు హనుమాన్ జయంతి సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. మొదట రామకోటి వద్ద భారీ హనుమంతుని ప్రతిమను, ప్రత్యేకంగా పూలతో అలంకరించి రథంపై పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శోభయాత్రను బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి,మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ శోభాయాత్ర బైక్ ర్యాలీ ఓల్డ్ మార్కెట్, చందనా బ్రదర్స్ సెంటర్ , టూ టౌన్ ఏరియా, ఫైర్ స్టేషన్ సెంటర్ మీదిగా సాగి రామకోటికి చేరుకుంది. పెద్ద ఎత్తున హనుమాన్ భక్తులు బైక్ ర్యాలీలో పాల్గొని జై హనుమాన్ జై జై హనుమాన్ అంటూ కాషాయ జెండాలు చేతపూని నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. ఈ సందర్భంగా గారపాటి చౌదరి మాట్లాడుతూ హనుమంతుని మాదిరిగా అవసరమైనప్పుడు శక్తి ప్రదర్శన చేయాలనీ, ఇటీవల ఉగ్రవాది శిబిరాలపై భారతదేశం ఆపరేషన్ సింధూర పేరుతో దాడులు నిర్వహించి మన శక్తి సమాజాలు ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. కులాల వారీగా విడిపోకుండా ప్రతి హిందు బంధు అనే విధంగా కలిసిమెలిసి ఉండాలని, మన ధర్మాన్ని ఆచరిస్తూ ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు కాకి సురేష్, నగర కన్వీనర్ గడ్డం నాగరాజు,బిజెపి నాయకులు చౌటపల్లి విక్రమ్ కిషోర్, కట్నేని కృష్ణ ప్రసాద్, ప్రాంత వివేకానంద కేంద్ర నిర్వాహకులు సదాశివ, సత్యానందగిరి స్వామీ, చౌటపల్లి విక్రమ్ కిషోర్, కట్నేని కృష్ణ ప్రసాద్, నెక్కంటి శ్రీనివాస్ , పెద్ద సంఖ్యలో వివిధ హిందూ సంఘాల ప్రతినిధులు,యువకులు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

## శతాధిక చిత్రాల తెలుగు సినిమా దర్శకుడు రాఘవేంద్రరావు



భీమవరం మే 22,(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తెలుగు సినీ రంగంలో దర్శకేంద్రుడు అని పిలువబడే శతాధిక చిత్రాల దర్శకుడు, రచయిత, నిర్మాత కె రాఘవేంద్రరావు అని వారి వీర అభిమాని, మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, శోభన్ బాబు సేవాసమితి కన్వీనర్ భట్టిప్రోలు శ్రీనివాసరావు, విజయలక్ష్మి దియేటర్ అధినేత తటవర్తి నారాయణ అన్నారు. సృజనాత్మక దర్శకుడు రాఘవేంద్రరావు పుట్టినరోజు సందర్భంగా మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు, అభిమానులు గురువారం తాడిమళ్ల వారి కాంప్లెక్స్ వద్ద వేడుకలను నిర్వహించి బిస్కెట్స్ స్వీట్స్ ను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ రొమాంటిక్ కామెడీ, ఫాంటసీ, మెలోడ్రామా, యాక్షన్ థ్రిల్లర్, జీవిత కథలు ఇలా ఆయన వెండితెరపై టచ్ చేయని అంశం లేదన్నారు. సినిమా అంతా ఒక ఎత్తైతే పాటలు మరో ఎత్తు అనేలా ఆయన దర్శకత్వం సాగుతుంటుందని, పండ్లు, పూల నేపథ్యంలో పాటల్ని తెరకెక్కిస్తూ వెండితెరని ఒక పెయింటింగ్ లా మార్చేస్తుంటారని, ప్రతి కథానాయిక రాఘవేంద్రరావు దర్శకత్వంలో ఒక్కసారైనా సినిమా చేయాలని ఆశపడుతుందంటే అతిశయోక్తి కాదన్నారు. యాభయ్యేళ్లుగా సాగుతున్న అనుభవాల్ని రంగరించి నేటి తరానికి ఒక పాఠంగా 'సౌందర్య లహరి'ని తీసుకొచ్చారన్నారు. 2014లో ఎన్టీఆర్ జాతీయ పురస్కారం, బిఎన్ రెడ్డి జాతీయ పురస్కారం పురస్కారాల్ని అందుకొన్నారని, తొలి చిత్రం శోభన్ బాబుతో చేశారని, 'బొబ్బిలి బ్రహ్మన్న', 'అల్లరి ప్రియుడు', 'పెళ్లిసందడి', 'అన్నమయ్య' చిత్రాలకి ఉత్తమ దర్శకుడిగా నంది పురస్కారాలు స్వీకరించారని, పెళ్లిసందడి' చిత్రంలో ఒక పాట నృత్య దర్శకత్వానికిగానూ ఉత్తమ కొరియోగ్రాఫర్ గా కూడా నంది అందుకున్నారన్నారు. ఆయన మరెన్నో పుట్టినరోజు వేడుకలను జరుపుకోవాలని కోరుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఓలేటి శ్రీనివాస్, పులవర్తి రామకృష్ణ, తటవర్తి బదరి, కారుమూరి బదరి, చవ్వా శ్రీనివాస సుబ్బారావు, బొండా హనుమంతరావు, కోట్ల నాని, కొల్లేపర్ల సుబ్బారావు, హస్ముఖ్ లాల్ పాల్గొన్నారు.

## దాసాంజనేయ స్వామికి 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకాలు

భీమవరం మే 22,(తెలుగురాష్ట్రం ప్రతినిధి)



శ్రీహనుమజ్జయంతి సందర్భంగా భీమవరం మారుతీ టాకీస్ సెంటర్ లోని శ్రీదాసాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారికి గురువారం 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకాలను నిర్వహించారు. ఆలయ ఈవో గొట్టుముక్కల సీతారామరాజు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు ఘంటసాల పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఎమ్మెల్యే అంజిబాబు సతీమణి సత్యవాణి శ్రీహనుమజ్జయంతి వేడుకలను ప్రారంభించారు. స్వామివారికి అష్టోత్తర (108) క్షీర కలశములతో పూజ, 300 మామిడిపండ్లు, 300 కొబ్బరికాయలు, పంచామృతాలతో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలను నిర్వహించారు. అనంతరం 3000 అరటిపళ్ళతో అర్చన, తులసీదళార్చన, విశేష పుష్పార్చన చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దేవస్థానంలో దర్శించుకున్నారు. అదే విధంగా సుంకర పద్దయ్య వీధిలోని 25 అడుగుల శ్రీఅభయ ఆంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీహనుమజ్జయంతి వేడుకలను నిర్వహించారు. రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) స్వామివారిని దర్శించుకుని శ్రీహనుమజ్జయంతి వేడుకలను ప్రారంభించారు. ఈ హనుమాన్ జయంతి అందరి జీవితాల్లో ఆరోగ్యం,. సంతోషం, అనందం తీసుకురావాలని, హనుమాన్ ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటున్నానని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. కార్యక్రమంలో లంకి చిన్ని, ముచ్చకర్ల శివ, ముచ్చకర్ల సుబ్బారావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి మహర్దశ

**- భవిష్యత్తు అంతా పర్యటక రంగానిదే - రానున్న ఐదేళ్లలో దేశంలోనే ఏపీ పర్యాటక రంగంలో మొదటి స్థానంలో నిలిచేలా కృషి .. ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్**




భీమవరం మే 22,(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యాటక రంగంలో ఐదేళ్లలో దేశంలో ఏపిని మొదటి స్థానంలో నిలిపేందుకు లక్ష్యంగా పెట్టుకుని పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించి పలు పర్యాటక ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ అన్నారు. గురువార కోపల్లె మంతెన హెరిటేజ్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ రాష్ట్రంలో హెూం స్టే విధానాన్ని అభివృద్ధి చేస్తూ పర్యాటకులకు చక్కని అనుభూతి తియ్యని జ్ఞాపకాలను పదిలం చేస్తుందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 1,842 హెూం స్టే యూనిట్లు విజయవంతంగా నడుస్తున్నాయని, ఒక తిరుపతిలోనే 561 హెూమ్ స్టేలు పని చేస్తుండటం విశేషమన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హెూదా కల్పించిన 12వ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని పర్యాటక రంగంలోని పరిశ్రమలకు ప్రోత్సాహాన్ని ఇస్తూ పర్యాటకానికి మద్దతుగా ఉండే వ్యవస్థలను బలోపేతం చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఒకప్పుడు భారతీయుల దృష్టిలో పర్యాటకమంటే తీర్థయాత్రలు, పుణ్యక్షేత్రాలు మాత్రమే అనుకునే వాళ్ళమని, ఇప్పుడు చారిత్రక, ప్రకృతిక ప్రదేశాల సందర్శనకు హెూం స్టేకు పర్యాటకులు ఆకర్షితులు అవుతున్నారని అన్నారు. సమావేశంలో జిల్లా జాయింటు కలెక్టరు టి రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో కె ప్రవీణ్ కుమార్ రెడ్డి, టూరిజం సహాయ సంచాలకులు ఏ లాజ్ వంతినాయుడు, మేనేజరు ఏ రాజ్యలక్ష్మి, కన్సల్టెంటు డి సాహితి, జిల్లా టూరిజం అధికారి ఏవి అప్పారావు, డ్వామా పిడి డా కె అప్పారావు, ఇంచార్జి హౌసింగు పిడి జి పిచ్చయ్య, ఇఇ యం శ్రీనివాసరావు, తహాశీల్దారు జి సుందర్ సింగు, యంపిడివో డా జి స్వాతి, మంతెన రామ్ కుమార్ వర్మ, హెరిటేజ్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## మేతర అజయ్ బాబు కుమార్తె వివాహం

**-ఎంపీ మహేష్ కుమార్ శుభాకాంక్షలు**



ఏలూరు, మే 22, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పవిత్ర వివాహ బంధంతో ఒకటైన నూతన దంపతులకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తన కార్యాలయం ప్రతినిధుల ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ఏలూరుకు చెందిన ప్రముఖ నాయకులు, సంఘ సేవకులు మేతర అజయ్ బాబు, రాణి దంపతుల కుమార్తె మౌనిక, తమిళనాడు తిరుపూర్ కు చెందిన సురేష్ , సుమతి కుమారుడు గణేష్ వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. ఏలూరులోని శుభలేఖ కల్యాణ మండపంలో జరిగిన రిసెప్షన్ కార్యక్రమంలో ఆహ్వానితుల పిలుపు మేరకు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కార్యాలయం ప్రతినిధులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి పెళ్లికానుకను అందజేయడం జరిగింది. నగరంలోని ప్రముఖులు నవ దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు అందజేశారు. అజయ్ బాబు దంపతులు ఆహ్వానితులకు సాదరంగా స్వాగతం పలికారు.

## హనుమజ్జయంతి సందర్భంగా భారీ అన్నదానం



రాజమహేంద్రవరం, మే 22 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):

దుర్గా సర్వీస్ పీపుల్(డీఎస్పీ) అనే పేరుతో ట్రస్టు స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్వారీ మార్కెట్ సెంటర్లో ఉన్న దుర్గ జిమ్ అధినేత దుర్గ తమ జిమ్ బయట ఆంజనేయ స్వామి విగ్రహాన్ని నెలకొల్పి ప్రతీ రోజు పురోహితులు రామకృష్ణ శర్మ ఆద్వర్యంలో పూజా కార్యక్రమాలు నిరహిస్తున్నారు. హనుమజ్జయంతి సందర్భంగాఆకుపూజ, అష్టోత్తరము, సహస్రనామ పారాయణం, షోడశోపచారాల పూజలు, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. తమ ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని హైకోర్ట్ న్యాయవాది ఆదిలక్ష్మి దంపతులు ప్రారంభించారు. సుమారుగా వెయ్యి మందికి పైగా ప్రజలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ట్రస్ట్ సభ్యులు రిటైర్డ్ ప్రిన్సిపాల్ అభిమళ్ళ బాబూజీ రావు, మురళీకృష్ణ, శివారెడ్డి, నాని, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రానున్నది వైఎస్సార్సీపీ కార్యకర్తల ప్రభుత్వం

**-మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ**




రాజమహేంద్రవరం, మే 22 (తెలుగు రాష్ట్రం విలేకరి):

కార్యకర్తల బలమే.. పార్టీ బలమని, రానున్నది వైఎస్సార్సీపీ కార్యకర్తల ప్రభుత్వమని వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం కడియం మండల వైఎస్సార్సీపీ కార్యకర్తల విస్తృత సమావేశం కడియం గ్రామంలోని గిరజాల కల్యాణ మండపంలో కోలాహలంగా జరిగింది. వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు యాదాల సతీష్ స్థాలిన్ అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు ఆధ్వర్యం వహించారు. మాజీ మంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షులు చెల్లుబోయిన వేణు, పార్లమెంటరీ నియోజక వర్గ ఇంచార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి చెల్లు బోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ మాట్లాడుతూ అందరూ కార్యకర్తలుగా సమన్వయంగా పనిచేసి పార్టీని బలోపేతం చేద్దామన్నారు. జగనన్న పాలనలో చారిత్రాత్మకమైన సంక్షేమ పథకాలు అందాయన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మాయ మాటలు చెబుతూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందన్నారు. రానున్నది జగనన్న వైఎస్ఆర్సిపి కార్యకర్తల ప్రభుత్వమన్నారు. వైఎస్ఆర్సిపి రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గం ఇన్చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కుట్రలు కుతంత్రాలతో పాలన సాగిస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో ముందుగా వైయస్సార్ విగ్రహానికి పూలమాలు వేసిన ఘన నివాళి అర్పించారు. అనంతరం ఇటీవల ఆకస్మిక మృతి చెందిన వైయస్ఆర్సీపీ కార్యకర్తలకు సంతాపం తెలియజేసి నివాళి అర్పించారు. అదే విధంగా అమర జవాన్లకు నివాళి అర్పించి కొద్దిసేపు మౌనం పాటించారు. నియోజకవర్గంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మండల స్థాయి నాయకులు హాజరయ్యారు.

తెలుగురాష్ట్రం
దినపత్రిక

# సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్న మంత్రి కొల్లు



**అన్నవరం, మే 22(తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామివారిని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గురువారం నాడు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ స్వామి వారిని దర్శించుకుని, ఆశీర్వాదం తీసుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. స్వామివారి ఆశీర్వాదం రాష్ట్రంపై పుష్కలంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.ఆలయ నిర్వహణ పట్ల సిబ్బంది చూపిస్తున్న శ్రద్ధను అభినందించారు. స్వామి వారి ప్రసాదం, అన్నదానం పరమ పవిత్రంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం వేదపాఠశాల, నక్షత్ర వనం పరిశీలించారు.ఆగమ పాఠశాలలో విద్యార్థులకు వేద విద్య కోసం సువిశాలమైన ప్రాంగణం ఏర్పాటును అభినందించారు.మన సంస్కృతి, సనాతన ధర్మాన్ని కాపాడటంలో వేదపాఠశాల అత్యంత కీలకం అన్నారు. వేద విద్యార్థులకు స్టైఫండ్ కూడా అందించడం ద్వారా వేద విద్యను కాపాడేలా తీసుకుంటున్న చర్యల పట్ల మంత్రి కొల్లు రవీంద్ర హర్షం వ్యక్తం చేశారు.

# నేటి సెలబ్రేటిల్లో అత్యధికులు సన్నాసులు - చరిత్ర హీనులు

### -మేడా శ్రీనివాస్, జగత్ సత్యాలు..రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ ..

**రాజమహేంద్రవరం, మే 22( తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**



భారతీయుల సాహస మరణం దేశ భద్రతకై వుండాలి . దేశ ద్రోహం కై ఉండరాదు .భారతీయ తల్లిదండ్రులు బిడ్డల పెంపకంలో దేశ భక్తిని నింపాలి . అక్కరకు లేని గారం, ప్రేమతో ఉండరాదు. భారతీయుల పాఠ్యంశాల్లో స్వదేశీ చారిత్రిక త్యాగాలను , పోరాటాలను ఒక సబ్జెక్ట్ గా పెట్టాలి. ప్రస్తుత భారతీయ పాఠ్యంశాల్లో భారత్ ను ఆక్రమించుకున్న ఆక్రమ దారులుకు వున్న ప్రధాన్యత మన భారతీయుల త్యాగాలు పోరాటాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వక పోవటం భారతీయుల దురదృష్టం. భారత్ లో మతసామారస్యంతో పాటుగా దేశ రక్షణ ప్రతి భారతీయుడు జన్మ కర్తవ్యం అని పాఠ్యంసాల ద్వారా తెలియ చేయాలి .భారతదేశంలో ప్రస్తుతం అమల్లో వున్నటు వంటి బూజపట్టిన కొన్ని వ్యవస్థలను రద్దు చేసి ప్రజలకు ప్రభుత్వాలపై పూర్తి నమ్మకం కల్పించాలి.దేశ ద్రోహం చేయని ఏకైక పౌరులు భారతీయులు అని ప్రపంచానికి తెలియ చేయాలి . అందుకు ప్రస్తుత పాలకులను పూర్తిగా సంస్కరించుకోవాలి ..మత గ్రంధాల కన్నా సంస్కృతి, సాంప్రదాయలే పవిత్ర మైనవి అవే దైవ సందేసాలను తెలిపే గురువులను , భోదకులను మాత్రమే ప్రజలు ప్రోత్సాహించాలి.ఆధిపత్య ధోరణికి తావులేని దైవ ప్రార్ధకులకు మాత్రమే దైవ అనుగ్రహం దక్కుతుంది . దైవం వుందని బ్రతికేవారు మానవత్వాన్ని జయిస్తారు. లేదని బ్రతికే వారు రాక్షసులుగా ఆకారణ మరణాలకు చేరుకుంటారు. ప్రస్తుతం దైవ ప్రాగణాలకు వెళ్లె వారు , దీక్షలకు పూనే వారు వారిలో గల అత్యాశ , దుర్బుద్దిని, స్వార్థం, క్రూరత్వం, మోసం వంటి వాటిని వదులు కున్న వారికే దైవ ఆశీస్సులు దక్కుతాయని చారిత్రిక ఋజువులు వున్నాయి . లేని వారికి దరిద్ర్యం , అనారోగ్యాలు నిత్యం వెంటాడుతుంటాయి.ప్రకృతిని కాపాడుకోకుండా దైవ ఆశీస్సులు పొందాలనుకునే వారు మూర్ఖులు . అజ్ఞానులు . వారిని అనుసరించటం పాతాళ దరిద్రులుగా మిగులుతారు. ప్రకృతిని కాపాడుకునే వారికి , పాలనను కలుషితం చేయని వారికి దైవ శక్తి నిత్యం తోడుగా ఉంటుంది . భారతీయ మహిళ ప్రకృతి లో ఒక భాగం అని నమ్మాలి. స్త్రీని రక్షించే వారి వద్దను , మాతృత్వాన్ని గెలిచే మహిళ వద్దను సంకల్ప శక్తి, వాక్ శుద్ధి మెండుగా ఉంటాయి . దురదృష్ట వసాత్తు భారతీయ మహిళ హక్కులు , శృతిమించిన స్వేచ్ఛ అంటు తన శక్తిని తనే కోల్పోతుంది.మతం మనుషులను నాశనం చేస్తుంది . ధర్మం వ్యవస్థలను , సమాజాన్ని నిరంతరం కాపడుతుంది . బిడ్డలకు మంచి ఉత్తమ భవిష్యత్ ను ఇస్తుంది .నేటి కలియుగ యుగంలో సెలబ్రేటీస్ గా చాలామణి అవుతున్న వారిలో అనేకులు రాక్షసులు . సన్నాసులు లేనని, వీరు బ్రతుకు జీవితాన్ని మాత్రమే గెలుస్తారు. మరణాన్ని గెలవలేరు, ప్రపంచంలో ఏకైక దైవ శక్తి గల దేశం ఒక్క అఖండ భారతదేశం మాత్రమే . భారత్ ను శాసిస్తున్నది మాత్రమే పాలకులు . రక్షిస్తున్నది కాపాడుతున్నది మాత్రం దైవ శక్తి అని నమ్మాలి .దైవ రహస్యం , ఉత్తమ గురువు ఆంతర్యం పై పరిశోధనలు జరపాలనుకోవటం విద్రోహం వంటిది . మంచిని పంచాలనుకోవటం సామాజిక భాధ్యతా దృక్పధం వంటిది. నేడు పవిత్ర గ్రంధాలు అనుకుంటున్నటు వంటిని ఎప్పుడో కొంతమంది కలుషిత భోదకులు నాశనం చేసేసారు . నేడు వున్నది ధర్మం ఒక్కటే మిగిలి వుంది. మతం కోసం ఆధిపత్య పోరు సాగించే వర్గాలు అన్ని రాక్షస తెగలు . ధర్మం కోసం పోరాడే వర్గాలు అన్ని మనుష్య తెగలు . రాసాయినిక కలుషిత నైవేధ్యాలను దైవానికి అర్పిస్తు దైవ ఆశీస్సులు దక్కాలనుకునే ముర్కులుకు దైవ అనుగ్రహం దక్కుతుందా ! అబద్దాన్ని నిజం గాను , నిజంను అబద్ధంగాను బ్రతికే బానిసలుగా మార్చేసిన ప్రస్తుత పాలకులు .ఆశాస్త్రియతను శాస్త్రియతగా నమ్ముతున్న నేటి సమాజానజం మార్పును కోరుకోవాలి . అప్పుడే సామాజిక భద్రత, మానవ భద్రత సాధ్యం . ఉన్న భూ గ్రహాన్ని పూర్తిగా పాడు చేసుకుంటు మరో కొత్త గ్రహాన్ని అన్వేషయించుకుంటున్న ప్రపంచ మేతావులు ఈ కలియుగంలోనే ఉన్నారా ! పూర్తి స్థాయి భద్రత , ఆరోగ్యం, పేదరికం లేని జీవితం , మత సామరస్యాన్ని కొరకునే దేశ భక్తులకు " రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ " ను ప్రోత్సహించండి .

## నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన

# 200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

### -ఎక్సైజ్ సిఐ శ్రీధర్



**దేవీపట్నం, మే 22(తెలుగు రాష్ట్రం విలేకరి):**

అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగరాహుల్ ఆదేశముల మేరకు రంపచోడవరం ఎక్సైజ్ సీఐ శ్రీధర్ వారి సిబ్బందితో కలిసి దేవీపట్నం మండలం నాగులపల్లి గ్రామంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. నాటసారాయి తయారీకి సిద్ధంగా ఉన్న 800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి సదరు ఊటదారుడిని గుర్తించి కేసు నమోదు చేశారు. అదే విధంగా రంపచోడవరం ఎక్సైజ్ స్టేషన్ లో పాత నేరములలో ముద్దాయిలుగా ఉన్న ఎనిమిది మందిని ఆకస్మిక దాడులలో అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం సెంట్రల్ జైలుకి పంపించడం జరిగిందని ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు. అదేవిధంగా నాటు సారాయి తయారుచేసిన అమ్మిన చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటామని ముద్దాయిలని బైండోవర్ చేయించి తదుపరి నేరములకు పాల్పడకుండా ప్రయత్నం చేస్తామని మరల నేరంలో పాల్పడిన వారికి తహశీల్దార్ ద్వారా ఒక లక్ష రూపాయల వరకు జరిమానా విధింప చేస్తామని ఎవరి వద్దనైనా నాటు సారాయి సంబంధిత సమాచారం ఉన్నాయెడల రంపచోడవరం ఎక్సైజ్ స్టేషన్కు సమాచారం ఇవ్వాల్సిందిగా తెలిపారు.

# పవన్ కళ్యాణ్‌ను కలిసిన వేగుళ్ళ లీలాకృష్ణ



**మండపేట, మే 22(తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్, మండపేట నియోజకవర్గ జనసేనపార్టీ ఇంచార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణ మర్యాదపూర్వకంగా బాధ్యతలు చేపట్టిన తొలిసారి జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను కలిశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ని గురువారం మంగళగిరి జన సేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్, మండపేట నియోజకవర్గ జనసేనపార్టీ ఇంచార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ గా ఆయన్ను నియమించిన సందర్భంగా పవన్ కళ్యాణ్ ని కలిసి ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నూతన పదవి భాధ్యతలు తీసుకున్న తరువాత మొదటి సారిగా పవన్ కళ్యాణ్ ని కలిసి ఆయనకు పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా లీలాకృష్ణ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. అధినేత తనకు అత్యంత కీలకమైన పదవి ఇచ్చారని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. మండపేట నియోజకవర్గం లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్రం లో నీటి పారుదల వ్యవస్థ అభివృద్ధి కి రైతాంగానికి అండగా ఉంటామని చెప్పారు.

# సిరిగిందలపాడు ఆయకట్టు మరమ్మతులకు ప్రతిపాదనలు

### -కలెక్టర్ దినేష్ కుమార్



**రంపచోడవరం, మే 22 (తెలుగు రాష్ట్రం విలేకరి):**

రంపచోడవరం మండలంలోని సిరిగిందలపాడు ఆయకట్ట ద్వారా గిరిజన రైతులకు సాగునీరు అందించేందుకు పూడికతీతలు, మరమ్మత్తులకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్. దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం రంపచోడవరం మండలం రంపచోడవరం పంచాయతీలోని సిరిగిందలపాడు ఆయకట్టు ద్వారా సుమారు 450 ఎకరాలకు పందిరి మామిడి, జాగారంపల్లి గ్రామాల గిరిజన రైతులకు సాగునీటి కోసం ఏర్పాటుచేసిన సిరిగిందలపాడు ఆయకట్టు మరమ్మత్తుల కోసం గిరిజన రైతులు,రంపచోడవరం ఎంపీపీ తదితరులు జిల్లా కలెక్టర్ వారి దృష్టికి తీసుకురాగా వెంటనే కలెక్టర్ స్పందించి పరిశీలించడం జరిగింది.జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, డీఎఫ్ఓ రవీంద్ర దామ సిరిగిందలపాడు ఆయకట్టు పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ రంపచోడవరం పంచాయతీ పరిధిలో సిరిగిందలపాడు ఆయకట్టు ద్వారా గిరిజన రైతులకు సాగునీరు అందించే విధంగా పూడికతీతకు అదేవిధంగా మరమ్మతులకు సంబంధించిన ప్రతిపాదనలు తయారుచేసి సమర్పించాలని ఆయన అన్నారు. ఈ ఆయకట్టు ద్వారా ఎన్ని గ్రామాల గిరిజన రైతులు వ్యవసాయం చేయుచున్నది అదేవిధంగా ఎన్ని ఎకరాలకు ఈ ఆయకట్టు ద్వారా సాగునీరు అందిచున్నది తదితర వివరాలు ఆయన అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ వారి వెంట ఎంపీపీ బంధం శ్రీదేవి,రంపచోడవరం సర్పంచ్ మంగ బుజ్జయ్య,తాసిల్దార్ పి రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, సుబ్బయ్య, ఎంపీడీవో యస్. శ్రీనివాసరావు దొర, ఉపాధి హామీ పథకం ఎపిడి బి సత్యనారాయణ, ఏఈ సాయి చందు, ఆర్ఐ నిర్మల, సిడిపిఓ సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


## హనుమాన్ జయంతి సందర్భంగా బైక్ ర్యాలీ



**జీలుగుమిల్లి, మే22(తెలుగు రాష్ట్రం విలేకరి):**

మండల కేంద్రం జీలుగుమిల్లిలో వేంచేసి ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో గురువారం హనుమద్ జయంతి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, బైక్ ర్యాలీ విహెచ్ పి రాష్ట్ర నేత టీఎస్ రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు చిరంజీవి శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన జిల్లా కార్యదర్శి గడ్డ మణుగు రవికుమార్ దంపతులు స్వామి వారిని దర్శించుకుని స్వర్ణ (బంగారు) నామం అందజేసారు. అనంతరం స్వామి వారి భక్తులు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జై-హనుమాన్, జై-శ్రీరామ్ నినాదాలతో గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని స్థానిక ఎస్సై నవీన కుమార్ స్వామివారి దర్శనం అనంతరం జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి చాట్రాతి ప్రసాద్, ఆలయ కమిటీ చైర్మన్ కోలా ధర్మరాజు, వైస్ చైర్మన్ కొప్పుల అన్నవరం, చిట్లూరి చంద్రరావు, కక్కిరాల మురళి, మాతంశెట్టి కిషోర్, విహెచ్ పి నాయకులు వేదుల జనార్ధన రావు, దాసు సంక్షేమ సంఘం అధ్యక్షులు పాముల వి ప్రసాద్, సంఘం కార్యదర్శి జెట్టి రామకృష్ణ, నేలటూరి సత్యం మాస్టర్, గడ్డం జనార్ధన్, పోలుకొండ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో కళకల్లాడిన ఆంజనేయస్వామి ఆలయాలు



**కామవరపుకోట, మే 22 (తెలుగు రాష్ట్రం విలేకరి):**

కామవరపుకోట మండల వ్యాప్తంగా ఉన్న ఆంజనేయ స్వామి వారి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పాతూరు లోని ఆంజనేయ స్వామి వారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, 108 హనుమాన్ చాలీసా, అభిషేకములు నిర్వహించారు. వడ్లపల్లి, తడికలపూడి లలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తాడిచర్ల 25 అడుగుల భారీ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆయా కమిటీల వారు తీర్థ ప్రసాదములు అందించారు.

# 270 కోట్లతో విద్యుత్ శాఖలో ఆధునీకరణ పనులు

### -ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్

**చింతలపూడి, మే 22 (తెలుగు రాష్ట్రం విలేఖరి):**



చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ ఆధ్వర్యంలో మీ సమస్య మా పరిష్కారం అనే శీర్షికన జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో మరియు వినియోగదారులతో ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గంలోని నాలుగు మండలాలు చెందిన రైతు సోదరులు గృహవినియోగదారులు పాల్గొని శాఖ పరంగా వారి ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.దానిపై శాసనసభ్యులు పరిష్కారం చేసి సమస్యను పరిష్కరించాల్సిందిగా విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.అధికారులు ప్రజలతో సత్సంబంధాలు , సరైన భావవ్యక్తీకరణ కలిగి నమ్రతతో మేలగాలని రోషన్ కుమార్ సూచించారు. పట్టణాలలో మరియు గ్రామీణ ప్రాంతంలో వినియోగదారుల సమస్యలను నమోదు చేయడానికి రిజిస్టర్లు ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. 270 కోట్లలో ఎంతో ఆర్డిఎస్ఎస్ పథకం కింద గ్రామీణ మరియు పట్టణ ప్రాంతంలో 24 గంటలు విద్యుత్ సరఫరా 9 గంటల పాటు వ్యవసాయానికి విద్యుత్తు అందించే లక్ష్యంతో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నట్టు రేషన్ పేర్కొన్నారు. గడిచిన 2 దశాబ్దాల కాలంలో ఈ విధంగా అధికారులతో ప్రజలతో మమేకమై ప్రజల ముందు వారి సమస్యలను సత్వర పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యేగా రోషన్ కుమార్ చరిత్రలో నిలిచారని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, విద్యుత్ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## తరచూ మొరాయిస్తున్న ఆర్టీసీ బస్సులు

**కామవరపుకోట, మే 22 (తెలుగు రాష్ట్రం విలేకరి):**



జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన బస్సు వడ్లపల్లి వద్ద ఆగిపోయింది. జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాస్ పురం నుండి పెదవేగి మండలం కొండలరావు పాలెం పెళ్లి నిమిత్తం బస్సును మాట్లాడుకున్నారు. మార్గమధ్యంలో బస్సు ఆగిపోవడం తో పెళ్లికి వెళ్లాల్సిన బంధువులందరూ దిగాలు చెందారు. కాలం చెల్లిన బస్సులు పెళ్లి వారికి పంపించడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమయానికి పెళ్ళికి వెళ్లకుండా బస్సు కారణంగా ఆగిపోయినట్టు తెలిపారు. జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన బస్సులు ప్రతినిత్యం ఏదో ఒక ప్రాంతంలో మొరాయిస్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. మంచి పనులను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## మద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా హనుమాన్ జయంతి



**జంగారెడ్డిగూడెం, మే 22 (తెలుగురాష్ట్రం విలేఖరి):**

మద్ది ఆంజనేయ స్వామి వారి ఆలయ సన్నిధిలో హనుమాన్ జయంతి సందర్భంగా " లక్ష తమలపాకుల పూజ" అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుండి ప్రభాత సేవ నిత్యార్చన, కైంకర్యములు, హనుమద్ జయంతి సందర్భంగా ఆలయ ప్రాంగణం ప్రత్యేక హెూదా అలంకరించి లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తదుపరి నిత్య హెూమం బలిహరణాలు నీరాజనం మంత్రపుష్పములు చతుర్వేద పారాయణులు, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు సాయంకాల హెూమము బలిహరణలు నీరాజనం మంత్రపుష్పములు కార్యక్రమం నిర్వహించబడినవి. శుక్రవారం ఉదయం ఐదున్నర గంటల నుండి శ్రీ ఆంజనేయ స్వామి వారి కి పాత సేవ నిత్యార్చన నిత్య హెూమం పరిహరణలు అనంతరం సువర్చల హనుమాన్ కళ్యాణం నీరాజనం మంత్రపుష్పములు ప్రసాదం వితరణ 6 గంటలకు వివిధ మేళ తాళాలతో అంగరంగ వైభవంగా గురవాయిగూడెం చక్ర దేవరపల్లి గ్రామాలలో స్వామివారి గ్రామోత్సవము బలిహరణ మంత్రపుష్పములు ప్రసాద వితరణ నిర్వహించబడునని దేవస్థాన కార్య నిర్వాణ అధికారిని ఆర్.వి చందన తెలిపారు.

## అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు

**పోలవరం, మే 22(తెలుగు రాష్ట్రం విలేకరి):**





పోలవరం ప్రాజెక్టు కార్యాలయం సమీపంలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం ఆలయ సంరక్షకులు ప్రాజెక్టు అధికారులు హనుమాన్ జయంతి,ఆలయ 16 వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమలపాకులు, గంధ సింధూరంతో స్వామి వారికి అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జలవనరులశాఖ అధికారులు, పోలీస్ శాఖ, వ్యాప్కోస్, మెగా, బావర్ కం పెనీల ప్రతినిధులు, ఇంజనీర్లు సిబ్బంది ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

SPORTS NEWS

https://epaper.teluguraastram.com

అమలాపురం
మే 23,
శుక్రవారం 2025



# మార్ష్ ఆరో హాఫ్ సెంచరీ..

## తొలి వికెట్ అందించిన సాయి కిశోర్



గుజరాత్ టైటాన్స్ బౌలర్లపై విరుచుకుపడుతున్న లక్నో సూపర్ జెయింట్స్(%బూ+%) ఓపెనర్ మిచెల్ మార్ష్ (51) అర్ధ శతకం సాధించాడు. ఇస్టరీ స్పిన్ సాయి కిశోర్ బౌలింగ్‌లో సిక్సర్‌తో అర్ధ శతకం సాధించాడు మార్ష్. 33 బంతుల్లోనే ఈ హిట్టర్ ఫిఫ్టీకి చేరువయ్యాడు. ఈ సీజన్లో ఈ ఆసీస్ చిచ్చరపిడుగుకు ఇది లక్నో తరఫున ఆరో హాఫ్ సెంచరీ కావడం విశేషం. %శతక భాగస్వామ్యం నెలకొల్పేలా కనిపించిన ఓపెనింగ్ ద్వయాన్ని సాయికిశోర్ విడదీశాడు. చివరి బంతికి ఎడెన్ మర్క్‌రమ్(36)ను ఔట్ చేసి గుజరాత్‌కు తొలి బ్రేక్ ఇచ్చాడు. మర్క్‌రమ్ కొట్టిన బంతిని బౌండరీ వద్ద షారుక్ ఖాన్ క్యాచ్ పట్టడంతో 91 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత వచ్చిన నికోలస్ పూరన్(6) చివరి బంతిని స్టాండ్స్‌లోకి పంపాడు. దాంతో, లక్నో 10 ఓవర్లకు వికెట్ నష్టానికి 97 పరుగులు చేసింది.

# పోరాడి ఓడిన ప్రణయ్.. క్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్

ప్రతిష్ఠాత్మక మలేషియా మాస్టర్స్‌లో గురువారం భారత షట్లర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల సింగిల్స్‌లో స్టార్ ఆటగాడు కిడాంబి శ్రీకాంత్ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. ఐర్లాండ్ ఆటగాడు నాట్ గుయెన్‌ను చిత్తుగా ఓడించాడీ మాజీ వరల్డ్ నంబర్ 1. మిక్స్‌డ్ డబుల్స్ ప్రీ-క్వార్టర్ ఫైనల్లోధ్రువ్ కపిల, తనీషా క్రాస్టో ద్వయం అదరగొట్టింది. అయితే.. కుర్రాళ్లు హెచ్‌ఎస్ ప్రణయ్ , ఆయుశ్ శెట్టి, కరుణాకరన్‌లకు మాత్రం చుక్కెదురైంది. %మాజీ నంబర్ 1 శ్రీకాంత్ రెండో రౌండ్‌లోనూ దుమ్మురేపాడు. తొలి రౌండ్‌లో లూ గాంజ్ జూ(చైనా)ను చిత్తు చేసిన భారత ఆటగాడు గురువారం కూడా అదే జోరు చూపించాడు. 33వ ర్యాంకర్ అయిన గుయెన్‌కు చుక్కలు చూపించాడు. హెూరాహెూరీగా సాగిన తొలి సెట్‌ను 23-21తో గెలుచుకున్న శ్రీకాంత్.. రెండో సెట్‌లో మరింత చెలరేగాడు.



# సెన్కోకాయ్ కరాటేకు ప్రపంచ గుర్తింపు

## ఫలించిన మాస్టర్ శాస్వత్‌కుమార్ కృషి



హైదరాబాద్‌కు చెందిన కరాటే మాస్టర్ హన్షి శాస్వత్‌కుమార్ కృషి ఫలించింది. మార్షల్ ఆర్ట్స్‌లో డాక్టరేట్ పొందిన 36 ఏండ్ల శాస్వత్‌కుమార్ పలు అరుదైన రికార్డులను సొంతం చేసుకున్నాడు. 10 సెకన్ల వ్యవధిలో 112 బ్యాక్‌ఫిస్ట్ పంచ్‌లు సంధించి ప్రపంచంలోనే ఫాస్టెస్ట్ బ్యాక్‌ఫిస్ట్ పంచర్‌గా రికార్డుల్లోకెక్కాడు. అంతటితో ఆగకుండా గత ఆరేండ్లుగా కరాటేలో వినూత్న ప్రయోగాలకు తోడు తన అద్భుత నైపుణ్యాన్ని జోడిస్తూ భారత్‌లోనే తొలిసారి కరాటేలో కొత్త రకం 'సెన్కోకాయ్ కరాటే'ను ఆవిష్కరించాడు. దీనిపై శాస్వత్‌కుమార్ మాట్లాడుతూ 'సెన్కోకాయ్ కరాటేకు ఇటీవలే జపాన్ మార్షల్ ఆర్ట్స్ నిపుణుల నుంచి గుర్తింపు లభించింది. జపాన్ గ్రాండ్‌మాస్టర్ల సలహాలకు కఠోరమైన ప్రాక్టీస్‌తో కరాటేలో కొత్త శైలిని తీసుకొచ్చాను. షాటోకాన్, క్యోకుశిన్, మార్షల్ ఆర్ట్స్ కాంబినేషన్‌లో సెన్కోకాయ్ కరాటే ఉంటుంది. సమాజంలో పోకిరీల ఆటకట్టించేందుకు అమ్మాయిలకు ఇది సెల్ఫ్ డిఫెన్స్‌గా ఉపయోగపడుతుంది. సెన్కోకాయ్ కరాటేలో పది వర్జినల్ కటా ఫీచర్లు ఉంటాయి' అని వివరించాడు. జపాన్ మార్షల్ ఆర్ట్స్ నుంచి శాస్వత్‌కుమార్ 10వ డాన్ బ్లాక్‌బెల్ట్ అందుకోవడం విశేషం.

# ఓవైపు ఓటమి బాధ..

## అంతలోనే మ్యాచ్ ఫీజులో కోత..!

ఐపీఎల్ 18వ సీజన్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన ఢిల్లీ క్యాపిటల్స్ (%ణవశ్రీష్ట్రఱ ఝబూూఙ్ఖశ్రీం%)కు మరో షాక్. అసలే ఓటమి బాధలో ఉన్న ఆ జట్టు ప్రధాన పేసర్ ముకేశ్ కుమార్ (%వీబఎవంష్ట్ర ఖబఝథతీ%)కు జరిమానా పడింది. ఐపీఎల్ కోడ్ ఉల్లంఘించినందుకు అతడి మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించారు రెఫరీ. బుధవారం వాంఖడే మైదానంలో ముంబై ఇండియన్స్ (%వీబఎఝఱ ×అఎఋఱఅం%)తో జరిగిన మ్యాచ్‌లో ముకేశ్ లెవల్ 1 తప్పిదానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గుర్తించిన రిఫరీ ఐపీఎల్ క్రమశిక్షణ కమిటీకి ఈ స్పీడ్‌స్టర్‌పై ఫిర్యాదు చేశాడు. మ్యాచ్ అనంతరం.. విచారించగా ఢిల్లీ పేసర్ తన తప్పును అంగీకరించాడు. దాంతో, అతడికి 10 శాతం జరిమానా విధించారు. 'ముకేశ్ కుమార్ ఆర్టికల్ 2.2 ప్రకారం లెవల్ 1 తప్పిదం చేశాడు. మ్యాచ్ అనంతరం మ్యాచ్ రిఫరీ తనపై విధించిన జరిమానాను అతడు అంగీకరించాడు. లెవల్ 1 పొరపాట్ల విషయంలో రిఫరీ నిర్ణయమే ఫైనల్' అని ఐపీఎల్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.



# ఆర్సీబీ స్క్వాడ్‌లో విధ్వంసక బ్యాటర్..

## ప్లే ఆఫ్స్‌లో చెలరేగుతాడా..?



ఐపీఎల్ 18వ సీజన్ ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తొలి టైటిల్ గెలవాలనే కసితో ఉంది. చివరి లీగ్ మ్యాచ్‌లను విజయంతో నాకౌట్ పోరుకు ఆత్మవిశ్వాసం కూడగట్టుకోవాలని ఆర్సీబీ భావిస్తోంది. అయితే.. ఆ జట్టులోని విదేశీ క్రికెటర్లు కీలకమైన ప్లే ఆఫ్స్‌కు దూరం కానుండడంతో కొత్తవాళ్లను తీసుకుంటోంది బెంగళూరు యాజమాన్యం. ఇప్పటికే పేసర్ లుంగి ఎంగిడి బదులు జింబాబ్వే స్పీడ్‌స్టర్ బ్లెస్సింగ్స్ ముజరబనికి తమ బృందంలో చోటు కల్పించిన ఫ్రాంచైజీ.. తాజాగా మరొకరిని ఎంపిక చేసింది. వెస్టిండీస్ సిరీస్ కోసంస్వదేశం వెళ్లనున్న యంగ్‌స్టర్ జాకబ్ బెథెల్ స్థానంలో న్యూజిలాండ్ చిచ్చరపిడుగు టామ్ సీఫర్ట్ ను స్క్వాడ్‌లో చేర్చుకుంది. మే 24న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్ తర్వాత నుంచి బెథెల్ ఐపీఎల్‌కు దూరమయ్యే అవకాశముంది. దాంతో, న్యూజిలాండ్ చిచ్చరపిడుగు సీఫర్ట్‌ను స్క్వాడ్‌లో చేర్చుకుంది ఆర్సీబీ. ఈ విషయాన్ని గురువారం ఎక్స్ వేదికగా బెంగళూరు ఫ్రాంచైజీ ప్రకటించింది.

# 24న కొత్త కెప్టెన్ ఎంపిక?



ముంబై: ఇంగ్లండ్‌తో జరిగే టెస్టు సిరీస్ కోసం ఈ నెల 24 టీమిండియాను ఎంపిక చేయనున్నట్టు సమాచారం. అదే రోజు టెస్టు జట్టు సారథిని కూడా ప్రకటించనున్నారు. ఈ మేరకు బుధవారం జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. రోహిత్ శర్మ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంతో కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మరో సీనియర్ ఆటగాడు విరాట్ కోహ్లి కూడా టెస్టులకు గుడ్‌బై చెప్పేశాడు. అంతకు కొన్ని రోజుల ముందే స్టార్ ఆల్‌రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇలా స్వల్ప వ్యవధిలో ముగ్గురు సీనియర్లు తప్పుకోవడంతో టీమిండియా బలహీనంగా మారింది. ఇలాంటి స్థితిలో కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేయడం కూడా సెలెక్టర్లకు సవాల్‌గా తయారైంది. యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ పేరు కెప్టెన్సీ రేసులో ముందు వరుసలో ఉంది. అతనికి సారథ్య బాధ్యతలు అప్పగించేందుకు బిసిసిఐ పెద్దలు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. జస్‌ప్రిత్ బుమ్రా, కెఎల్ రాహుల్‌లు రేసులో ఉన్నా గిల్‌కే కెప్టెన్సీ దక్కే అవకాశం ఉంది. శనివారం జరిగే సెలెక్షన్ కమిటీ సమావేశంలో కొత్త కెప్టెన్‌తో పాటు జట్టును ఎంపిక చేయనున్నట్టు సమాచారం.

## ఈ నెల 24న ఇంగ్లాండ్ టూర్ కు

# భారత జట్టు ప్రకటన

న్యూఢిల్లీ: ఇంగ్లాండ్‌తో జరగనున్న ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం టీమిండియా జట్టును భారత క్రికెట్ నియంత్రణ మండలి(%దీజజ×%) మే 24న(శనివారం) ప్రకటించనుంది. సెలక్షన్ కమిటీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ జట్టును ప్రకటించే ముందు విలేకరుల సమావేశంలో పాల్గొనే అవకాశం ఉంది. కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్ట్ ఫార్మాట్ కు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో భారత జట్టుకు కొత్త టెస్టు కెప్టెన్ ను ప్రకటించనున్నారు. శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్ లు టెస్టు కెప్టెన్ రేసులో ఉన్నారు. జస్ప్రీత్ బుమ్రా పేరు కూడా వినిపిస్తోంది. అయితే, గిల్ నే కెప్టెన్ గా ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జట్టులో సాయి సుదర్శన్, కరుణ్ నాయర్ లను జట్టులోకి తీసుకోనున్నట్లు సమాచారం. ఇంగ్లాండ్‌తో జరిగే ఐదు మ్యాచ్‌ల సిరీస్ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (%ఔజ%) నాల్గవ ఎడిషన్‌లో టీమిండియా ఆడబోయే మొదటి మ్యాచ్ అవుతుంది. మొదటి రెండు ఎడిషన్‌లలో భారత్ ఫైనల్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే.

# సల్మాన్ నివాసంలో కలకలం..

## రెండ్రోజుల్లో ఇద్దరు చొరబాటుదారుల అరెస్ట్



బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ నివాసం గెలాక్సీ అపార్ట్‌మెంట్లలోకి అక్రమంగా ప్రవేశించేందుకు వరుసగా జరుగుతున్న ప్రయత్నాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. మే 20న జితేంద్ర కుమార్ సింగ్ అనే యువకుడు చొరబడేందుకు ప్రయత్నించి అరెస్ట్ కాగా, ఆ మరుసటి రోజే (మే 21న) తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో ఇషా ఛబ్రా (36) అనే మహిళ కూడా అదే భవనంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించి లిఫ్ట్ వరకు చేరుకుంది. పోలీసులు ఆమెను కూడా అరెస్టు చేసి, ఇద్దరిపై అక్రమ ప్రవేశం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, మే 20న ఉదయం 9:45 గంటల సమయంలో జితేంద్ర కుమార్ సింగ్ సల్మాన్ ఖాన్ ఇంటి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు. అక్కడి భద్రతా సిబ్బంది అతడిని అక్కడి నుంచి వెళ్లిపోవాలని హెచ్చరించగా, జితేంద్ర కోపంతో తన ఫోన్‌ను నేలకేసి విసిరేశాడు.అదే రోజు సాయంత్రం 7:15 గంటల ప్రాంతంలో జితేంద్ర మళ్ళీ సల్మాన్ ఖాన్ ఇంటి వద్దకు వచ్చాడు. ఈసారి, గెలాక్సీ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న మరో వ్యక్తి కారు వెనుక దాక్కుని లోపలికి ప్రవేశించే ప్రయత్నం చేశాడు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది అతడిని అడ్డుకుని వెంటనే బాంద్రా పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులు జితేంద్రను అదుపులోకి తీసుకుని విచారించగా, తాను సల్మాన్ ఖాన్ అభిమానినని, ఆయనను వ్యక్తిగతంగా కలవాలనుకుంటున్నానని చెప్పాడు. భద్రతా సిబ్బంది అనుమతించకపోవడంతో కారు వెనుక దాగి లోపలికి వెళ్లాలని ప్రయత్నించినట్లు తెలిపాడు. అతడి వద్ద ఎటువంటి ఆయుధాలు లేవని పోలీసులు నిర్ధారించారు. మరోవైపు మే 21న ఇషా ఛబ్రా (36) అనే మహిళ గెలాక్సీ అపార్ట్‌మెంట్‌లో ప్రవేశించినట్లు పోలీసులు తెలిపారు. ఆమెను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.ఇటీవల సల్మాన్ ఖాన్‌కు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 14న ఆయన ఇంటి వద్ద కాల్పుల ఘటన జరిగిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సల్మాన్‌కు 'వై ప్లస్' స్థాయి భద్రతను కల్పించింది. ఈ నేపథ్యంలో, ఈ అక్రమ ప్రవేశ ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రూ.6 కోట్ల డీల్.. మైసూరు శాండల్‌కి బ్రాండ్ అంబాసిడర్‌గా మిల్కీ బ్యూటీ!






ఇటీవల ఓదెల 2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ప్రముఖ నటి తమన్నా భాటియా మరో బంఫర్ ఆఫర్‌ను దక్కించుకుంది. కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ తయారు చేస్తున్న ప్రఖ్యాత మైసూరు శాండల్ సబ్బులతో పాటు ఇతర ఉత్పత్తులకు బ్రాండ్ అంబాసిడర్‌గా తమన్నా నియమితులయ్యింది. ఈ ఒప్పందం రెండేళ్ల కాలానికి కుదరగా, ఇందుకోసం ఆమెకు రూ. 6.2 కోట్ల భారీ మొత్తం చెల్లించనున్నట్లు సమాచారం.ఈ నియామకంతో కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ తమ ఉత్పత్తుల మార్కెట్‌ను మరింత విస్తరించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. తమన్నాకున్న విశేష ప్రజాదరణ, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఆమెకున్న ఫాలోయింగ్ తమ బ్రాండ్‌కు విస్తృత ప్రచారం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది.ప్రస్తుతం తమన్నా పలు తెలుగు, హిందీ చిత్రాలతో పాటు వెబ్ సిరీస్‌లతో బిజీగా ఉన్నారు. ఈ కొత్త బ్రాండ్ అంబాసిడర్ డీల్‌తో ఆమె కెరీర్‌లో మరో కీలక మైలురాయిని చేరుకున్నారు. మిల్కీ బ్యూటీ తమన్నా ఇకపై మైసూరు శాండల్ ఉత్పత్తుల ప్రచార చిత్రాలు, ప్రకటనల్లో సందడి చేయనున్నారు.

# కేన్స్‌లో సిందూరంతో ఐశ్వర్య రాయ్...

**ఉగ్రవాదంపై పోరుకు ప్రతీక అన్న సెలీనా జైట్లీ**

**కేన్స్ 2025లో పాపిట సిందూరంతో ఐశ్వర్య రాయ్ ప్రత్యేక ఆకర్షణ**

**ఐశ్వర్య లుక్‌పై నటి సెలీనా జైట్లీ ఆసక్తికర స్పందన**

**సిందూరం ఉగ్రవాదం, అసహనానికి వ్యతిరేకంగా బలమైన ప్రకటన అని వ్యాఖ్య**



కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 2025 వేడుకల్లో భారతీయ నటి ఐశ్వర్య రాయ్ బచ్చన్ తన ప్రత్యేకమైన ఆహార్యంతో అందరి దృష్టిని ఆకర్షించారు. మే 21న జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె పాపిటలో సిందూరం ధరించి కనిపించడం విశేషం. సంప్రదాయ భారతీయ ఆభరణాలతో, తెల్లటి చీరలో మెరిసిన ఐశ్వర్య, సిందూరంతో తన లుక్‌ను పూర్తిచేశారు. ఈ ఫోటోలు ఇంటర్నెట్‌లో వేగంగా వైరల్ అయ్యాయి. ఐశ్వర్య రాయ్ సిందూరంతో కనిపించడంపై ప్రముఖ నటి సెలీనా జైట్లీ స్పందించారు. సిందూరం ధరించడం వెనుక ఉన్న లోతైన అర్థాన్ని వివరిస్తూ ఆమె సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు. కేవలం సంప్రదాయానికే పరిమితం కాకుండా, ఉగ్రవాదం, అసహనం వంటి వాటికి వ్యతిరేకంగా సిందూరం ఒక బలమైన సందేశాన్ని ఇస్తుందని సెలీనా అభిప్రాయపడ్డారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో సెలీనా జైట్లీ ఈ విషయంపై స్పందిస్తూ, "ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సిందూరం ట్రెండ్ అవుతోంది. ఇది కేవలం వైవాహిక బంధానికి చిహ్నం మాత్రమే కాదు. భారతదేశపు సామూహిక స్ఫూర్తికి, ప్రేమకు, త్యాగానికి, ప్రతిఘటనకు ఇది ఒక శక్తివంతమైన ప్రతీకగా నిలుస్తోంది. దీని అందం గురించి ప్రపంచం మాట్లాడుకుంటున్నప్పుడు, మనకు దీని అసలు అర్థం గుర్తుండాలి. ఇది పవిత్రమైనది, శక్తివంతమైనది, ఇప్పుడు ఇదొక స్టేట్ మెంట్ కూడా" అని రాసుకొచ్చారు. "సిందూరం అనేది కేవలం వ్యక్తిగత విషయం కాదు, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలబడటానికి, జవాబుదారీతనం డిమాండ్ చేయడానికి, శాంతియుతంగా జీవించే మన హక్కును కాపాడుకోవడానికి ఇది ఒక పిలుపు" అని సెలీనా పేర్కొన్నారు. మనం ప్రేమించే వారిని, కోల్పోయిన వారిని, తిరిగి తీసుకురావడానికి పోరాడుతున్న వారిని సిందూరం ద్వారా గౌరవిస్తామని ఆమె తెలిపారు. "దీన్ని కేవలం సంప్రదాయంగానే కాకుండా, అది సూచించే ప్రతీదాన్ని కాపాడుకుంటామని చేసే ప్రమాణంగా ధరిస్తాం" అని సెలీనా వివరించారు.ాగా, ఐశ్వర్య రాయ్ తన దంతపు రంగు చీరను, సాంప్రదాయ ఆభరణాలను సిందూరంతో జతచేసి కేన్స్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.


# మానవత్వం చాటుకున్న హీరో మోహన్ లాల్



మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ తనలోని మానవత్వాన్ని చాటుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు. నిన్న ఆయన తన 65వ పుట్టినరోజును జరుపుకున్నారు.1960 మే 21న జన్మించిన ఆయన, నాలుగు దశాబ్దాలకు పైగా తన అద్భుత నటనతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఈ పుట్టినరోజు సందర్భంగా మోహన్ లాల్ రెండు కీలకమైన సేవా కార్యక్రమాలను ప్రకటించి తన గొప్ప మనసును చాటుకున్నారు. కేరళలో కాలేయ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న నిరుపేద చిన్నారులకు అతి తక్కువ ఖర్చుతో కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు మోహన్ లాల్ ప్రకటించారు. "చాలా మంది చిన్నారులు కాలేయ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. వారిలో అనేకమందికి ఈ ఆపరేషన్ అత్యవసరం. అలాంటి వారందరికీ తన ఫౌండేషన్ అండగా నిలుస్తుంది" అని ఆయన తెలిపారు. తన విశ్వశాంతి ఫౌండేషన్ ద్వారా ఈ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు

# ధనుష్ హీరోగా అబ్దుల్ కలాం బయోపిక్..






భారతదేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం వెండితెరపై ఆవిష్కృతం కానుంది. 'కలాం' పేరుతో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్ఠాత్మక బయోపిక్‌లో ప్రఖ్యాత నటుడు, జాతీయ అవార్డు గ్రహీత ధనుష్ ప్రధాన పాత్ర పోషించనున్నారు. ఆదిపురుష్' చిత్రంతో వార్తల్లో నిలిచిన ఓం రౌత్ ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహించనున్నారు. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు. ఈ వార్త యావత్ భారతీయ సినిమా ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. టాలీవుడ్ నిర్మాత అనిల్ సుంకర కూడా ఈ చిత్ర నిర్మాణంలో పాలు పంచుకుంటుండడంతో తెలుగువారిలోనూ ఈ సినిమాపై ఆసక్తి నెలకొంది.

# ఆమె నాకు క్షమాపణలు చెప్పింది.. వివాదంపైసిమ్రాన్ క్లారిటీ



సీనియర్ హీరోయిన్ సిమ్రాన్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. అయితే ఆమె చాలా రోజుల తర్వాత మళ్లీ వార్తల్లో నిలుస్తోంది. ఆమె ఓ వివాదంపై తాజాగా క్లారిటీ ఇచ్చింది.గతంలో ఓ ఈవెంట్ లో సిమ్రాన్ మాట్లాడుతూ 'నేను ఓ సినిమా చూశాను. అది నాకు చాలా బాగా నచ్చింది. అందులో ఓ నటి పాత్రను ప్రశంసిస్తూ నేను ఓ నోట్ రాశాను. దానికి ఆమె ఇచ్చిన రిప్లైతో నిజంగా షాక్ అయ్యాను. ఆమె ఆంటీ రోల్స్ చేయడం కన్నా ఇలాంటి డబ్బా రోల్స్ చేయడమే బెటర్ అంటూ రిప్లై ఇచ్చింది. అది చూసి నిజంగా ఆశ్చర్యపోయాను. అయినా అలాంటి డబ్బా రోల్స్ చేయడం కంటే గౌరవంగా ఆంటీ రోల్స్ చేయడంలో తప్పులేదు' అంటూ సిమ్రాన్ మాట్లాడింది.ఆమె చేసిన వ్యాఖ్యలు పెద్ద చర్చనీయాంశంగా మారాయి. డబ్బా కార్టెల్ సిరీస్ లో చేసిన నటిని ఉద్దేశించే ఇలాంటి కామెంట్లు చేసిందంటూ రూమర్లు వచ్చాయి. ఈ వివాదంపై తాజాగా సిమ్రాన్ స్పందించింది. నేను మాట్లాడింది చాలా మంది తప్పుగా అర్థం చేసుకున్నారు. ఆ నటిని నేను ప్రశంసించాను. కానీ ఆమె సరిగా అర్థం చేసుకోలేదు. తర్వాత నాకు సారీ కూడా చెప్పింది. నిజంగా ఆమె నటన నన్ను ఆశ్చర్యానికి గురి చేసింది' అంటూ చెప్పుకొచ్చింది సిమ్రాన్. ఆమె చేసిన కామెంట్లు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339